అచల గురుమాతాజీ సమేత అచల గురూజీ
వారి అఖండ పరిపూర్ణ ఆశీస్సులతో



సత్య దీపిక
ఉదయం
తెలుగు దినపత్రిక

SDU NEWS
SATHYA DEEPIKA UDAYAM
PLEASE SUBSCRIBE | SHARE | LIKE

ప్రచురణ : అమలాపురం | సంపుటి : 01 | సంచిక : 121 | శుక్రవారం 06-11-2026 | ఎడిటర్: ఎస్.ఎస్ రావు | పేజీలు : 04 | వెల : 3-00

పెరిగిన చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయ రద్దీ.



- దీపావళి వేళ భాగ్యలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తులు
- నవంబరు 6 నుంచి 11 వరకు ట్రాఫిక్ ఆంక్షలు
- మదీనా, ముర్గీ చౌక్, షా అలీ బండ మార్గాల్లో ట్రాఫిక్ జామ్ అవకాశం
- ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని పోలీసుల సూచన
- వాహనదారుల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాల ఏర్పాటు
- వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం
- ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి

2లో

అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



- క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం
- అంతర్జాతీయ పోటీల నిర్వహణకు ప్రణాళికాబద్ధమైన చర్యలు
- గచ్చిబౌలిలో తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ ఛాలెంజ్ -- 2026
- పుల్లెల గోపీచంద్ అకాడమీలో కొనసాగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు
- నవంబరు 3 నుంచి 8 వరకు అంతర్జాతీయ టోర్నమెంట్
- పతిభ చాటే క్రీడాకారులకు ప్రభుత్వ అండ
- దేశ, రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలను పెంచేలా ప్రోత్సాహం

2లో

మురసు తుఫానుతో ప్రాథమికంగా
రూ.1,918 కోట్ల నష్టం



2లో

- 1.43 లక్షల హెక్టార్లలో దెబ్బతిన్న వ్యవసాయ పంటలు
- 1.86 లక్షల మంది రైతులపై తుఫాను ప్రభావం
- 6,749 హెక్టార్లలో దెబ్బతిన్న ఉద్యానవన పంటలు
- తుఫాను నష్టాలపై ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- శుక్రవారం తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం పర్యటన
- నష్టంపై సమగ్ర నివేదిక రూపొందించి కేంద్రానికి పంపాలి
- విద్యుత్, రహదారులు, తాగునీటి సరఫరా పునరుద్ధరణకు ప్రాధాన్యం
- 3,946 విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా 1,493 పునరుద్ధరణ
- 760 కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రాష్ట్ర, జిల్లా రహదారులు
- టెలికాం సేవలు 97.1 శాతం పునరుద్ధరణ
- 59 మండలాలు, 649 గ్రామ పంచాయతీలపై తుఫాను ప్రభావం
- వరద ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణ

ఏపీలో ముగిసిన జడ్పీటీసీ ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్

- రాష్ట్రవ్యాప్తంగా ముగిసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్
- ఉదయం మందకొడిగా.. మధ్యాహ్నం నుంచి ఊపందుకున్న పోలింగ్
- ఓటు హక్కు వినియోగించుకున్న లక్షలాది మంది ఓటర్లు
- 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం
- 77 జడ్పీటీసీ, 2,051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం
- పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల్లో ఉద్రిక్తతలు
- వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య వాగ్వాదాలు.. తోపులాటలు
- కొన్ని చోట్ల పెట్రోల్ బాంబులు, కర్రలు, రాళ్లతో దాడులు
- పోలీసుల జోక్యంతో అదుపులోకి వచ్చిన పరిస్థితులు
- బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించిన అధికారులు
- అవకతవకలు జరిగినట్లు తేలితే నవంబర్ 6న రీ పోలింగ్
- నవంబర్ 11, 12 తేదీల్లో ఎంపీపీ, జడ్పీ చైర్‌పర్సన్ ఎన్నికలు

-చెదురుముదురు ఘటనలు మినహా ప్రశాంతంగా సాగిన ప్రక్రియ
-ప్రాథమిక అంచనాల ప్రకారం 65--68% పోలింగ్ నమోదు
-నవంబర్ 7న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి
-స్ట్రాంగ్ రూమ్‌లకు బ్యాలెట్ బాక్సుల తరలింపు





అమరావతి,**సత్యదీపిక ఉదయం**
ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల సమరంలో కీలక ఘట్టమైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్, సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో వర్షం కారణంగా ఉదయం పోలింగ్ మందకొడిగా సాగినా, మధ్యాహ్నం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. చెదురుమదురు ఘర్షణలు, వాగ్వాదాలు మినహా పోలింగ్ ప్రక్రియ చాలా వరకు ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు.మధ్యాహ్నం 3 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 58.55% పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. పోలింగ్ ముగిసే సమయానికి ఈ శాతం 65 నుంచి 68 శాతం మధ్య ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. రాయలసీమ, కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనగా, కొన్ని గిరిజన, తీర ప్రాంతాల్లో పోలింగ్ శాతం

ఎన్నికల ప్రక్రియ మొత్తం కబ్జా

- స్థానిక ఎన్నికల ప్రక్రియను పూర్తిగా కబ్జా చేశారు
- అధికార దుర్వినియోగం, బెదిరింపులతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు
- నామినేషన్ల నుంచి ఫలితాల వరకు అడుగడుగునా అక్రమాలు
- ఎన్నికల సంఘం, పోలీసుల తీరుపై మాజీ సీఎం జగన్ తీవ్ర విమర్శలు
- వేలాది మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను బెదిరించి అరెస్టులు చేశారు
- నామినేషన్ల తిరస్కరణలోనూ అక్రమాలు జరిగాయి
- 84 జెడ్పీటీసీ, 2,109 ఎంపీటీసీ స్థానాల్లో పోటీ లేకుండా చేశారు
- సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు
- పోలింగ్ బూత్‌ల నుంచి బ్యాలెట్ బాక్సుల వరకు రిగ్గింగ్
- ఎన్నికల అక్రమాలపై న్యాయపోరాటం కొనసాగిస్తాం
- చంద్రబాబు గెలిచి ఓడితే.. మేం ఓడి గెలిచాం
- అక్రమాలను గెలుపుగా చెప్పుకోవడం సిగ్గుచేటు: జగన్

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన చంద్రబాబు
చంద్రబాబు గెలిచి ఓడితే.. మేం ఓడి గెలిచాం



తాడేపల్లి, **సత్యదీపిక ఉదయం**
స్థానిక ఎన్నికల నిర్వహణ పైన మాజీ సీఎం జగన్ సంచలన వ్యాఖ్యలు చేసారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ కబ్జా చేసారని ఆరోపించారు. నామినేషన్ల పర్వం నుంచి ఫలితాల వెల్లడి వరకు ప్రతీ దశ లోనూ అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. ఎన్నికల సంఘం.. పోలీసులు సైతం ప్రభుత్వాని కి మద్దతుగా నిలిచి ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసారని వ్యాఖ్యానించారు. తాము న్యాయ పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. పోలింగ్ పూర్తయిన తరువాత ఓట్ల సంఖ్య ఎలా పెరిగిందని జగన్ ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచే సత్తా లేక చంద్రబాబు అక్రమాలు చేసారని మండిపడ్డారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, బెదిరింపులు, అక్రమాల ద్వారా సీఎం చంద్ర బాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని మాజీ ముఖ్యమంత్రి

మిగతా 2లో

ప్రధాని మోదీపై రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు



2లో

- ట్రంప్ నియంత్రణలో మోదీ పనిచేస్తున్నారంటూ ఆరోపణలు
- చర్చకు వస్తే ఐదు నిమిషాల్లో నిరూపిస్తానని సవాల్
- పార్లమెంటులో తన మైక్ కట్ చేస్తున్నారని మండిపాటు

అదుపులోకి తీసుకున్నప్పటి నుంచే
24 గంటల లెక్క

-గడువు దాటితే వెంటనే విడుదల చేయాలని స్పష్టీకరణ
-అసలు నిర్బంధ సమయాన్ని మేజిస్ట్రేట్ నమోదు చేయాలి
-అరెస్ట్ పై పోలీసులకు సుప్రీంకోర్టు కీలక సూచన!



2లో

ఎన్నికల ప్రక్రియ మొత్తం కబ్జా

జగన్ ఆరోపించారు. శకుని మాయా పాచికల్లా ఎన్నికల ప్రక్రియను రిగ్ చేశారని, అధికార దుర్వినియోగం, రౌడీయిజంతో ఎన్నికల వ్యవస్థను తమ గుప్పిట్లోకి తీసుకున్నారని ఆరోపించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్, 143 హామీలపై ప్రజలకు సమాధానం చెప్పే ధైర్యం లేకే ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేశారని జగన్ ఆరోపించారు.వేలాది మంది వసీపీ కార్యకర్తలను బైండోవర్ పేరుతో పోలీస్ స్టేషన్లకు పిలిపించి బెదిరించారని, అరెస్టులు చేశారని ఆరోపించారు. టీడీపీ కార్యకర్తలతో పోలీసులు కుమ్మక్కై తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని అన్నారు. స్ట్రూటినీ పేరుతో పత్రాలు మాయం చేయడం, సంతకాలు ఫోర్జరీ చేయడం, నామినేషన్లను తిరస్కరించడం వంటి చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. నామినేషన్ల దశలోనే పోటీ లేకుండా చేశారని జగన్ ఆరోపించారు. పులివెందులలో 40 వార్డులకు గాను 20 వార్డుల్లో మాత్రమే తమ అభ్యర్థులు నామినేషన్లు వేయగలిగారని పేర్కొన్నారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ ఇదే తరహా దౌర్జన్యం కొనసాగిందని, 84 జెడ్పీటీసీ, 2,109 ఎంపీటీసీ స్థానాల్లో నామినేషన్ల దశలోనే పోటీ లేకుండా చేశారని ఆరోపించారు. అభ్యర్థులను అరెస్టు చేయడం, పోలింగ్ ఏజెంట్లను బూత్‌లలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకోవడం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం నామినేషన్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రాల వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ, వాటిని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదని జగన్ ఆరోపించారు.

మున్సిపల్ ఎన్నికల్లో 11,378 పోలింగ్ కేంద్రాలకు గాను 5,737 కేంద్రాల్లో మాత్రమే, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో 31,460 కేంద్రాలకు గాను 16,064 కేంద్రాల్లోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని తెలిపారు. నామినేషన్ల నుంచి ఫలితాల వరకు ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. నామినేషన్లు, స్ట్రూటినీ, పోలింగ్ బూత్‌లు, పోలింగ్ శాతం, రాత్రిపూట బ్యాలెట్ బాక్సుల నిర్వహణ వరకు అన్ని దశల్లోనూ రిగ్గింగ్ జరిగిందని విమర్శించారు. పోలింగ్ బూత్‌లలో అక్రమాలు జరుగుతున్నా పోలీసులు అడ్డుకోకుండా సహకరించారని జగన్ ఆరోపించారు.

చంద్రబాబు గెలిచి ఓడితే.. మేం ఓడి గెలిచాం:

స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు సర్కారు చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని, చివరకు రాత్రికి రాత్రే పోలింగ్ శాతాన్ని కూడా పెంచేసి మరీ గెలుపును తమ ఖాతాలో వేసుకున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. చంద్రబాబు గెలిచి ఓడితే.. తాము ఓడి, గెలిచామన్నారు. ఎన్నికలు సజావుగా సాగితే చంద్రబాబు ఎందుకు గెలుస్తారని ప్రశ్నించారు.

గెలుపుగా చెప్పుకోవడం సిగ్గుచేటు:

విశాఖలో రాత్రికి రాత్రే 1,15,887 ఓట్లు ఎలా పెరిగాయి. సోమవారం ఉదయానికి 1,35,154 ఓట్లు ఎలా పడ్డాయి. రాత్రి 51.46 శాతం అయితే ఉదయానికి 56.03 శాతానికి పెంచారు?. బ్యాలెట్ బాక్సుల స్ట్రాంగ్ రూమ్‌లకు కూడా సీల్ వేయలేదు.చీమకుర్తిలో రాత్రి 11 గంటలకు 78.28 శాతం.. రాత్రి 12 గంటలకు పోలింగ్ శాతం 84.36 శాతం? పెంచారు. జమ్మలమడుగులో ఉదయం 11గం.లకు 60 శాతం పోలింగ్ ఎలా సాధ్యం?, అద్దంకిలో ఉదయం 11 గంటలకి 19 శాతం.. మధ్యాహ్నం ఒంటి గంటకు 56 శాతమా?, ధర్మవరంలో 2 గంటల్లో 8 నుంచి 36. 36 శాతానికి ఎలా పెరిగింది?, పార్వతీపురంలో 2 గంటల్లో 12 శాతం నుంచి 44 శాతానికి పెరిగింది?

పోలింగ్ శాతాన్ని పెంచి.. రిగ్గింగ్ చేశారు. నామినేషన్లు రిగ్గింగ్.. స్ట్రూటినీ రిగ్గింగ్ చేశారు. పోలింగ్ బూత్‌ల రిగ్గింగ్.. పోలింగ్ సైక్లింగ్ రిగ్గింగ్. పోలింగ్ పర్సంటేజ్‌లు.. బ్యాలెట్ బాక్సులు సైతం రిగ్గింగ్ చేశారు. ఇవన్నీ దాటుకుని మా వాళ్లు గెలిస్తే.. ఆ ఫలితాలను కూడా రిగ్గింగ్ చేశారు' అని వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. జెన్ జీ తరంలోనూ రిగ్గింగ్, సైక్లింగ్ ఎలా చేయాలో ట్యూషన్లు పెట్టి మరీ చంద్రబాబు నేర్పించారని వైఎస్ జగన్ ఎద్దేవా చేశారు.

ఏపీలో ముగిసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్

కాస్త తక్కువగా నమోదైనట్లు సమాచారం. ఈ ఎన్నికల బరిలో నిలిచిన సుమారు 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది.

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు గాను 77 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 9,821 ఎంపీటీసీ స్థానాలకు గాను 2,051 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఈరోజు పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగానే సాగినప్పటికీ, పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదాలు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. కొన్ని చోట్ల పెట్రోల్ బాంబులతో దాడులు జరిగాయి. కొన్ని చోట్ల ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో దాడులకు దిగడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అయితే, సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనల వల్ల పోలింగ్‌కు పెద్దగా అంతరాయం కలగలేదు. పోలింగ్ ముగిసిన వెంటనే అధికారులు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీళ్లు వేసి, కట్టుదిట్టమైన భద్రత నడుమ వాటిని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఏవైనా కేంద్రాల్లో తీవ్రమైన అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయితే, నవంబర్ 6న అక్కడ రీ-పోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 7వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ ఫలితాల ఆధారంగా నవంబర్ 11, 12 తేదీల్లో ఎంపీపీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ వైర్‌పర్సన్‌ల ఎన్నికలు జరగనున్నాయి. దీంతో స్థానిక ప్రజాప్రతినిధుల ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది.

ప్రధాని మోదీపై రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు

కేంద్రం ప్రభుత్వం పై, ప్రధాని నరేంద్రమోదీ పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీ 'దేశద్రోహి' అని, ఆయనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రిస్తున్నారని ఆరోపించారు. తనతో చర్చకువస్తే మోదీ దేశ ద్రోహి అనే ఆ విషయాన్ని ఐదు నిమిషాల్లో నిరూపిస్తానని అన్నారు.

ఈ అంశంపై చర్చకు రావాలని ప్రధానికి సవాల్ విసిరితే పార్లమెంటులో చర్చిద్దామని ఎన్డీయే నేతలు అంటున్నారని చెప్పారు. కానీ లోక్‌సభలో తాను మాట్లాడకుండా మైక్ కట్ చేస్తారని విమర్శించారు. దేశంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు షా మూడేళ్ల గడువు పెట్టారని, అయితే అప్పటికి ఆయన ఆ పదవిలో ఉంటారో లేదో..? అని ఎద్దేవా చేశారు. తన అంచనా ప్రకారం ఏడాదిలోపే ప్రభుత్వం కూలిపోతుందని కీలక వ్యాఖ్యలు చేశారు. పంజాబ్‌లోని సంగ్రూర్‌లో బుధవారం జరిగిన ఇన్సాఫ్ ర్యాలీలో రాహుల్‌గాంధీ మాట్లాడారు. తాను అమిత్ షాను ఒక్కటే అడగాలనుకుంటున్నానని, అదానీ ఓడరేవులో పట్టుబడిన మాదకద్రవ్యాల సంగతేంటి..? ఆ విషయంలో మీరు తీసుకున్న చర్యలేమిటి..? అని ప్రశ్నించారు. మీరు పైకి శాంతిభద్రతల గురించి మాట్లాడుతున్నారని, కానీ మీరు గ్యాంగ్‌స్టర్లను ప్రోత్సహిస్తున్నారని దేశం మొత్తానికి తెలుసని అమిత్ షాను ఉద్దేశించి అన్నారు.

ఒకవేళ అమిత్ షా శాంతిభద్రతల గురించి మాట్లాడాలనుకుంటే మణిపుర్‌లో ఏం జరుగుతుందో దేశానికి చెప్పాలని రాహుల్‌గాంధీ అన్నారు. పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆప్‌పైనా రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఆప్ అధికారంలోకి వచ్చిన తర్వాత డ్రగ్స్ సమస్యను పూర్తిగా నిర్మూలిస్తామని భగవంత్ మాన్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ వారు ఎక్కడ నిర్మూలించారని ప్రశ్నించారు. పంజాబ్‌లో ఏ ఒక్క ప్రాంతం నుంచైనా వారు డ్రగ్స్‌ను నిర్మూలించారా..? అని నిలదీశారు.సమస్యను అంతంచేసే సామర్థ్యం వారికి లేదని రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. గతంలో లోక్‌సభలో భగవంత్ మాన్‌తో కలిసి కూర్చున్న సమయంలో ఆయన జోకులు వేసేవారని, ఆయన వద్ద మద్యం వాసన వచ్చేదని ఆరోపించారు. మాదక ద్రవ్యాలపై పోరాడలనుకుంటే ముఖ్యమంత్రి మద్యం మత్తులో ఉండకూడదని మాన్‌కు రాహుల్ చురకలంటించారు. సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సచిన్ పైలట్ కూడా పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు

-మంత్రి సత్యకుమార్ యాదవ్



అమరావతి, భీమోదయం: వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ ఓటు వేయడానికి కూడా ముందుకు రాకుండా ఓటమి భయంతో పారిపోయారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు ప్రజాస్వామ్యం, ఎన్నికల పారదర్శకత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. ప్రజాస్వామ్యంపై జగన్‌కు నిజంగా గౌరవం ఉంటే ప్రజల తీర్పును శిరసావహించాలి. ఎన్నికల్లో ఓటమిని అంగీకరించలేక వ్యవస్థలపై నిందలు వేయడం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు.

2019లో మెజార్టీ స్థానాలు సాధించినప్పుడు ప్రజల తీర్పుగా చెప్పుకున్న జగన్.. 2024, ప్రస్తుత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును ఎందుకు గౌరవించడం లేదని మంత్రి ప్రశ్నించారు. శాసనసభ సమావేశాలకు రాకుండా నాలుగు గోడల మధ్య మాత్రమే మైకు ముందు మాట్లాడే జగన్‌కు అధికారం ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం గొప్పగా కనిపించడం, అధికారం కోల్పోయాక అదే వ్యవస్థపై ఆరోపణలు చేయడం ఆయనలోని నైరాశ్యాన్ని స్పష్టం చేస్తోందన్నారు. ఎన్నికల ప్రక్రియపై జగన్ చేస్తున్న ఆరోపణలు రాజకీయ ప్రయోజనాల కోసమేనని మంత్రి పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎక్కడైనా లోపాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లో వాటిని నిరూపించుకోవాలి తప్ప, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు చేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. సంక్షేమ పాలన వల్ల కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలన తమ ప్రభుత్వ ప్రాధాన్యాలని తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పే అంతిమమని, ఆ తీర్పును గౌరవించలేని జగన్ ప్రజాస్వామ్య పాఠాలు చెప్పడం హాస్యాస్పదమని సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు.

మురసు తుఫానుతో ప్రాథమికంగా రూ.1,918 కోట్ల నష్టం

అమరావతి, మురసు తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో రూ. 1,918 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. గురువారం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు మురసు తుఫాను నష్టాలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, విద్యుత్, మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖల వారీగా జరిగిన నష్టాన్ని, చేపట్టిన సహాయక చర్యల వివరాలు సీఎం తెలుసుకున్నారు. వరుసగా రెండు తుపాన్లు రాష్ట్రాన్ని ప్రభావితం చేసిన నేపథ్యంలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, రహదారుల మరమ్మతులు, తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవడంపై ప్రధానంగా దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. శుక్రవారం స్వయంగా తాను తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని తెలిపారు. మురసు తుఫాన్ నష్టంపై సమగ్ర నివేదిక త్వరితగతిన రూపొందించి కేంద్రానికి సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు తాజాగా వెల్లడించిన ప్రాథమిక నష్టం అంచనాల ప్రకారం... తుపాను కారణంగా రాష్ట్రానికి సుమారు రూ.1,918.55 కోట్ల మేర ప్రాథమిక నష్టం వాటిల్లింది. 1,43,122 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతినగా, 1,86,063 మంది రైతులపై ప్రభావం పడింది. ఉద్యానవన పంటలు 6,749 హెక్టార్లలో దెబ్బతినగా, 12,586 మంది రైతులు ప్రభావితమయ్యారు. వర్షాల కారణంగా 983 ఇళ్లు, 346 బోట్లు, 220 వలలు కూడా దెబ్బతిన్నాయి. నీట మునిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు 48--72 గంటల సమయం అవసరమని అధికారులు తెలిపారు.

విద్యుత్, రహదారుల పునరుద్ధరణ చర్యలు:

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ యుద్ధ ప్రాతిపదికన జరుగుతోందని అధికారులు వివరించారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలో 1,103 ప్రభావిత 11 కేవీ ఫీడర్లలో 871 పునరుద్ధరించినట్టు సీఎంకు తెలిపారు. మరో 232 పునరుద్ధరించాల్సి ఉందని స్పష్టం చేశారు. 3,946 దెబ్బతిన్న 11 కేవీ విద్యుత్ స్తంభాల్లో 1,493 పునరుద్ధరించారు. ఏపీఎస్‌పీడీసీఎల్ పరిధిలో 11 కేవీ ఫీడర్లన్నీ పునరుద్ధరించాల్సి ఉందన్నారు. ఏపీ ట్రాన్స్‌కో పరిధిలో ప్రభావితమైన 25 హైటెన్షన్ ఫీడర్లలో 21 పునరుద్ధరించారు. ఆర్ అండ్ బీ పరిధిలో రాష్ట్ర, జిల్లా రహదారులు 760.10 కిలోమీటర్ల వరకు దెబ్బతిన్నాయి. 206 ప్రాంతాల్లో నేలకొరిగిన చెట్లను తొలగించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ పరిధిలో 74 గ్రామీణ రహదారులు దెబ్బతినగా, 204.14 కిలోమీటర్ల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. వీటి పునరుద్ధరణకు రూ.92.08 కోట్ల అవసరమని అంచనా వేశారు.

టెలికాం సేవలు 97 శాతం పునరుద్ధరణ:

గురువారం వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 31,428 టవర్లలో 30,518 టవర్లు తిరిగి పనిచేస్తున్నాయి. 97.1 శాతం సేవలు పునరుద్ధరించారు.

బాపట్ల, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల్లోనే పలుచోట్ల టవర్ల పునరుద్ధరణ జరగాల్సి ఉంది. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 59 మండలాలు, 649 గ్రామ పంచాయతీలు ప్రభావితం అయ్యాయి. 336 చోట్ల గుర్తించిన డ్రైనేజీ అడ్డంకులన్నింటినీ తొలగించారు. పారిశుద్ధ్య పనుల కోసం 5,515 బృందాలు, 1,489 జనరేటర్లను వినియోగిస్తున్నారు.

పెరిగిన చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయ రద్దీ..

హైదరాబాద్, నవంబరు 5

దీపావళి సందర్భంగా నగరంలోని చార్మినార్ వద్ద భాగ్యలక్ష్మి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు నవంబరు 6 నుంచి 11 వరకు ట్రాఫిక్ అడ్వైజరీ జారీ చేశారు. మదీనా, మూర్గీ చౌక్, షా అలీ బండ -- చార్మినార్ రూట్లలో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశముందని హెచ్చరించారు. ప్రత్యామ్నాయ మార్గాలు వాడాలని సూచించారు. కేటాయించిన పార్కింగ్ స్థలాల్లోనే భక్తులు వాహనాలను పార్క్ చేయాలని కోరారు. ట్రాఫిక్ పోలీసుల సూచనలు తు.చ. తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు.దీపావళి సందర్భంగా భాగ్యలక్ష్మి ఆలయానికి మీర్‌చౌక్ నుంచి వచ్చేవారికి ముఫీద్ ఉల్ అనామ్ స్కూల్ గ్రౌండ్, సర్దార్ మహల్ రోడ్ దగ్గర పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశామని ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. షా అలీ బండ నుంచి వచ్చేవారికి చార్మినార్ బస్ టెర్మినల్, యునాని ఆసుపత్రి వద్ద పార్కింగ్ కేటాయించామని వివరించారు.

మదీనా, నాయాపూల్ నుంచి వచ్చేవారు గోజీ కాంప్లెక్స్, కాలీ కమాన్ గర్ల్స్ స్కూల్ (ఆదివారం మాత్రమే) సమీపంలో వాహనాలను పార్క్ చేసుకోవాలని సూచించారు. పురానాపూల్, బేగం బజార్ వైపు వారికి వీజీ బ్రిడ్జ్, సిటీ కాలేజ్, ఓ స్టేడియం వద్ద పార్కింగ్ స్థలం కేటాయించామని తెలిపారు. హుస్సేనీ ఆలం వైపు వారికి న్యూ మూర్గీ చౌక్ ఖిల్వత్ రోడ్, ఝులుఖానా లాడ్ బజార్, ఖిల్వత్ గ్రౌండ్ దగ్గరలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశామని చెప్పారు.

అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

హైదరాబాద్, నవంబరు 5

తెలంగాణను అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) గచ్చిబౌలిలో తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ ఛాలెంజ్ -- 2026 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో అంతర్జాతీయ పోటీలు కొనసాగుతున్నాయి. నవంబరు 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు.ఈ పోటీల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని, ప్రసంగించారు. క్రీడారంగ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా తాము చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటే క్రీడాకారులకు తమ ప్రభుత్వ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. దేశ, రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలను పెంచే క్రీడాకారులకు అన్నివిధాలా ప్రోత్సాహం కల్పిస్తామని స్పష్టం చేశారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

అదుపులోకి తీసుకున్నప్పటి నుంచే 24 గంటల లెక్క



న్యూ ఢిల్లీ, : అరెస్టు చేసిన వ్యక్తిని 24 గంటల్లోగా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలన్న రాజ్యాంగ నిబంధనపై సుప్రీంకోర్టు కీలక వివరణ ఇచ్చింది. పోలీసులు అధికారికంగా అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి కాకుండా.. వాస్తవంగా నిర్బంధించిన క్షణం నుంచే లెక్కించాలని స్పష్టం చేసింది. ఒక వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించి అదుపులోకి తీసుకున్న సమయమే ఈ గడువుకు ప్రాతిపదిక అని తేల్చిచెప్పింది. త్రిపురలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన కేసులో బెయిల్ నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ నలుగురు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ కీలక తీర్పు వెలువరించింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్. చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు స్పష్టత ఇచ్చింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(2) ప్రకారం అరెస్టయిన వ్యక్తిని ప్రయాణానికి అవసరమైన సమయాన్ని మినహాయించి 24 గంటల్లోగా సమీప మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలి. మేజిస్ట్రేట్ అనుమతి లేకుండా అంతకుమించి నిర్బంధంలో ఉంచడానికి వీల్లేదు.

సోదాలు, స్వాధీనం ప్రక్రియ పూర్తయ్యాక పోలీసులు అధికారికంగా అరెస్టు నమోదు చేసినప్పటి నుంచే 24 గంటల గడువు ప్రారంభమవుతుందని భావించడం చట్టవిరుద్ధమే కాకుండా రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనం వ్యాఖ్యానించింది.వాస్తవంగా నిర్బంధించిన సమయం నుంచి 24 గంటలు దాటినా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచకపోతే సంబంధిత వ్యక్తిని వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ గడువును లెక్కించేటప్పుడు అరెస్టు చేసిన ప్రాంతం నుంచి మేజిస్ట్రేట్ కోర్టుకు చేరుకోవడానికి పట్టే ప్రయాణ సమయాన్ని మాత్రమే మినహాయించాలని స్పష్టం చేసింది.

అంతేకాదు, 24 గంటల్లోగా కోర్టు ఎదుట హాజరుపరిచినంత మాత్రాన నిర్బంధం చట్టబద్ధమైనట్లు కాదని ధర్మాసనం తెలిపింది. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 58 ప్రకారం కేసు పరిస్థితులకు అనుగుణంగా నిర్బంధ సమయం సహేతుకంగా ఉండేలా దర్యాప్తు సంస్థలు చూసుకోవాలని పేర్కొంది. నిందితుడిని తమ ఎదుట హాజరుపరిచినప్పుడు అతడి స్వేచ్ఛకు భంగం కలిగించిన అసలు తేదీ, సమయాన్ని మేజిస్ట్రేట్ నమోదు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రాజ్యాంగం నిర్దేశించిన 24 గంటల గడువు పాటించారా? లేదా? అన్నది స్వతంత్రంగా పరిశీలించాలని సూచించింది. నిర్బంధం సహేతుకమైన సమయాన్ని మించిందని భావిస్తే తదుపరి రిమాండ్‌కు అనుమతి నిరాకరించే అధికారం మేజిస్ట్రేట్‌కు ఉంటుందని స్పష్టం చేసింది.

మాకవరపాలెం మండలంలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

పోలింగ్ ముగింపు వేళ అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలి: జిల్లా ఎస్పీ ఆదేశం

ఎటువంటి అవాంఛనీయ ఘటనలకూ తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు



అనకాపల్లి నవంబర్ :05
(సత్యదీపిక ఉదయం బ్యూరో)
ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసేలా పోలీసు యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. గురువారం మాకవరపాలెం మండలంలోని మాకవరపాలెం, జి.గంగవరం మరియు భీమబోయినపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో స్వయంగా సందర్శించి, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ మాట్లాడి పలు కీలక సూచన చివరి నిమిషం వరకు పోలింగ్ ముగిసే సమయం అత్యంత కీలకమైనదని, ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకుని కేంద్రాల నుంచి సురక్షితంగా వెళ్లే వరకు ప్రతి ఒక్కరూ పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. అనవసరంగా గుమిగూడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.
ఈవీఎంల భద్రత: పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలు, పోలింగ్ సామాగ్రిని రిసెప్షన్/స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే ప్రక్రియ ఎస్కార్ట్ బందోబస్తు మధ్య అత్యంత కట్టుదిట్టంగా జరగాలని సూచించారు.

స్థానిక పోరులో తగ్గిన ఓటర్ల ఉత్సాహం

అమలాపురం, నవంబర్ 5 (సత్య దీపిక ఉదయం విలేకరి) :
స్థానిక ఎంపీటీసీ /జడ్పీటీసీ ఎన్నికల్లో పోలింగ్ శాతం భారీగా తగ్గుముఖం...

సహజంగా అసెంబ్లీ ఎన్నికలకంటే కూడా స్థానికంగా జరిగే ఎన్నికలకు పోలింగ్ శాతం ఎక్కువగా నమోదయ్యే అవకాశం.

కాని పరిస్థితి భిన్నంగా జిల్లా వ్యాప్తంగా 61.91 శాతం పోలింగ్ నమోదు.
అయినవిల్లి మండలం 69.92 శాతంతో అత్యధిక పోలింగ్ నమోదు కాగా, కాట్రేనికోన మండలంలో 50.06 శాతం, మలికిపురంలో 51.28 శాతం పోలింగ్ నమోదు.స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్‌లో ఓటర్ల భాగస్వామ్యం ఊహించిన స్థాయి లో లేకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి..
స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు వేయటానికి ఇష్టపడని అంత ఆసక్తి చూపని ఓటర్లు? పోలింగ్ బూత్ ల దగ్గర నీరు నిలిచి ఇబ్బందులు పడ్డ ఓటర్లు
పోటీ తీవ్రంగా ఉంటేనే తమ ఓటు నిర్ణయాత్మకం అవుతుందని భావించే సగటు ఓటరు భావించాడా? ఆర్నాబ్ మరియు మురుసు తూఫాన్ ప్రభావం, విద్యుత్ సమస్య ఓటర్ల అనాసక్తికి దారి తీసిందా? పోల్ మేనేజ్మెంట్ చేయటం లో విఫలం అవ్వటమే ప్రధాన కారణమా?పోలింగ్ శాతం తగ్గటం, ఓటర్ల అనాశక్తి రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసిన వైనం

కడియం మండలంలో ప్రశాంతంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు...

- **కడియం మండలంలో 78 పోలింగ్ కేంద్రాల్లో.. మొత్తం ఓటర్ల సంఖ్య 62081... పురుషులు...22319. స్త్రీలు..22117 మొత్తం పోలైన ఓట్లు..44436 పోలింగ్ శాతం71.57%**
- **పటిష్ట పోలీసు బందోబస్తుతో ఎన్నికల నిర్వహణ.. తూర్పుగోదావరి జిల్లా సౌత్ జోన్ డి.ఎస్.పి ఏ శివప్రియ**





కడియం నవంబర్05 (సత్యదీపిక ఉదయమ్ స్టాఫ్ రిపోర్టర్):-
తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు తూర్పుగోదావరి జిల్లా సౌత్ డిఎస్పీ ఏ శివప్రియ పోలీసు శాఖ వెల్లడించింది. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టామని, పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల నిర్వహణ సజావుగా సాగినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు సిబ్బందిని నియమించి, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలకు ముందస్తు సూచనలు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు పేర్కొన్నారు.
ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అత్యంత కీలకమైనవని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. కడియం మండలంలో ఎన్నికల నిర్వహణకు సహకరించిన ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల సిబ్బంది, కడియం సీఐ అల్లు వెంకటేశ్వర్లు పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.కడియం మండలంలో 78 పోలింగ్ కేంద్రాల్లోమొత్తం ఓటర్ల సంఖ్య 62081పురుషులు 22319 స్త్రీలు22117 మొత్తం పోలైన ఓట్లు44436 పోల్ అయినాయని, పోలింగ్ శాతం71.57% కడియం మండల రిటర్నింగ్ అధికారి నేతల మల్లికార్జునరావు తెలిపారు.
కడియం మండలంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో పోలీసు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విధులు నిర్వహించిన పోలీసు సిబ్బందిని, పంచాయితీ సచివాలయ వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందులను కడియం మండల రిటర్నింగ్ అధికారి నేతల మల్లికార్జునరావు, ఎంపీడీవో ఎం రమేష్ ఉన్నతాధికారులు అభినందించారు.

గంటి పెదపూడిలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు

-- ఎన్నికల సరళిని పరిశీలించిన ఐపిఎస్ అధికారి
-- ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుల అప్రమత్తత



పి.గన్నవరం, నవంబర్ 5 (సత్య దీపిక ఉదయం విలేఖరి ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. పి. గన్నవరం మండలం గంటి పెదపూడి గ్రామంలో ఎన్నికల నిర్వహణను ఐపిఎస్ అధికారి శాంతి పరిశీలించారు.ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది. గ్రామంలో ఎక్కడా గొడవలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేస్తూ, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడవద్దని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికల ప్రక్రియకు సహకరించాలని కోరారు.

పడవపై ప్రయాణించి ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

ఉడిమూడి లంక పోలింగ్ కేంద్రానికి పడవలో చేరుకున్న ఎమ్మెల్యే



పి.గన్నవరం, నవంబర్ 5 (సత్య దీపిక ఉదయం విలేకరి) : ప్రజాస్వామ్య పండుగలో తన వంతు బాధ్యతగా పి.గన్నవరం నియోజకవర్గ శాసనస భ్యుడు గిడ్డి సత్యనారాయణ వినూత్న రీతిలో ఓటు హక్కును వినియో గించు కున్నారు. పి.గన్నవరం మండలం ఉడిమూడి లంక గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి పడవపై ప్రయాణిస్తూ చేరుకున్న ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

95 ఏళ్ల వయస్సులోనూ ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధులు

వృద్ధాప్యాన్ని సైతం లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రానికి చేరిక.. యువతకు ఆదర్శంగా నిలిచిన జగ్గమ్మ, పాట్టెమ్మ





పలాస నవంబర్ 05 (సత్యదీపిక ఉదయం బ్యూరో శంకర్): వయస్సు పైబడినా ప్రజాస్వామ్యంపై ఉన్న బాధ్యతను మరువకుండా 92 ఏళ్ల వయస్సులోనూ ఓటు హక్కును వినియోగించుకుని వృద్ధులు అందరికీ ఆదర్శంగా నిలిచారు. పలాస మండలం పెదంచల గ్రామానికి చెందిన తలగాన జగ్గమ్మ (95) మంచేలా పొట్టెమ్మ (92) వృద్ధాప్యాన్ని సైతం లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రానికి చేరుకుని వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను చాటుతూ ఆమె చూపిన చొరవ పలువురిని ఆకట్టుకుంది. వయస్సు మీద పడినా ఓటు వేయాలన్న వారి పట్టుదల అభినందనీయమని స్థానికులు ప్రశంసించారు. యువత సైతం వారిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పలువురు అభిప్రాయపడ్డారు.

ప్రసవం అనంతరం అంబులెన్స్‌లో వచ్చి ఓటేసిన బాలింతలు!

ఆసుపత్రి నుంచి నేరుగా పోలింగ్ కేంద్రానికి.. ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిన పావని, జ్యోతి



పలాస, నవంబర్ 5 (సత్యదీపిక ఉదయం బ్యూరో శంకర్):
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతటి ప్రాధాన్యత కలిగిందో శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పెదంచల గ్రామానికి చెందిన ఇద్దరు బాలింతలు చాటిచెప్పారు. నందిగాం పావని, సవర జ్యోతి అనే ఇద్దరు మహిళలు ప్రసవానంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ డిశ్చార్జ్ అయిన వెంటనే ఇంటికి వెళ్లకుండా నేరుగా పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు.
ఆసుపత్రి నుంచి అంబులెన్స్‌లో ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రసవం అనంతరం విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితుల్లోనూ ప్రజాస్వామ్య ప్రక్రియలో తమ వంతు బాధ్యతగా ఓటు వేయడానికి ముందుకు రావడం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది.
ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ ఇద్దరు బాలింతలు తమ చొరవతో చాటిచెప్పారు. వీరి ఓటింగ్ చైతన్యం గ్రామస్థుల్లో చర్చనీయాంశంగా మారింది.

క్షేత్రస్థాయిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

పటిష్ట పోలీసు బందోబస్తుతో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగం

అనకాపల్లి, నవంబర్ :05
(సత్యదీపిక ఉదయం బ్యూరో)
అనకాపల్లి జిల్లా పరిధిలో జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తి ప్రశాంత వాతావరణంలో జరుగుతోందని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. గురువారం నాడు ఆయన జిల్లాలోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను స్వయంగా సందర్శించి, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్.రాయవరం మండలం పి.ధర్మవరం, నక్కపల్లి మండలం చిన్న దొడ్డీగల్లు, కోటవురట్ల మండలం రాజుపేట, కైలాసపట్నం తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ తనిఖీ చేశారు.క్యూలైన్లలో ఉన్న ఓటర్లతో మాట్లాడి ఏర్పాట్లపై ఆరా తీశారు. పోలింగ్ సిబ్బంది, ఎన్నికల అధికారులతో సమీక్షించి భద్రతా చర్యలపై పలు కీలక సూచనలు చేశారు. ఓటర్లు ఎటువంటి భయభ్రాంతులకు గురికాకుండా, ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన పోలీసు బందో బస్తు, బలగాల నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా, నిబంధనలకు లోబడి కొనసాగుతోందని స్పష్టం చేశారు. ?ఈ పర్యటనలో జిల్లా ఎస్పీ వెంట ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ కె.రవికుమార్, నక్కపల్లి రూరల్ సీఐ రామకృష్ణ, నక్కపల్లి యు.పి.ఎస్ సీఐ మురళి, అనకాపల్లి ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావు, ఏ.ఆర్. ఇన్‌స్పెక్టర్ మన్మధ రావు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రామాయణ: పార్ట్-1 రివ్యూ



రామాయణం పార్ట్ 1
నటీనటులు: రణ్‌బీర్ కపూర్, యశ్, సాయి పల్లవి, సన్నీ డియోల్, కాజల్, శోభన, అరుణ్, రవి దూబే, లారా దత్తా తదితరులు
నిర్మాణ సంస్థ: ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, ణచీజు+, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్
నిర్మాత: నితేష్ తివారీ
దర్శకుడు: నితేష్ తివారీ
సంగీతం: జిమ్మర్, ఏ.ఆర్. రెహమాన్
విడుదల తేది: నవంబర్ 5, 2026

ధర్మం అంటే ఏంటి? మాట విలువ ఏంటి? ఆశ మనిషిని ఎలా కృంగదీస్తుంది? స్వామి భక్తి అంటే ఏంటి? ఇలా.. ఎన్నో ప్రశ్నలకు సమాధానం ఆది కావ్యం రామాయణం. ఈ కావ్యానికి ఇప్పటికే ఎంతో మంది దృశ్యరూపం ఇచ్చారు. తెలుగుతో పాటు అన్ని భాషల్లోనూ ఎన్నో సినిమాలు తెరకెక్కాయి. ఇప్పుడు, సరికొత్త హంగులతో భారీ బడ్జెట్‌తో వచ్చిన చిత్రం రామాయణ(తెలుగులో రామాయణం). రణ్‌బీర్, యశ్, సాయి పల్లవి లాంటి పాన్ ఇండియా స్టార్స్ నటించడంతో మొదటి నుంచే ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి. మరి ఆ అంచనాలను ఈ 'రామాయణం' అందుకుందా లేదా? రివ్యూలో చూద్దాం.

కథేంటంటే..
రామాయణం..అందరికీ తెలిసిన కథే. ప్రత్యేకంగా చెప్పుకోనక్కర్లేదు. దర్శకుడు నితేష్ తివారీ రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాడు. మొదటి భాగంలో రావణుడు ఘోర తపస్సు చేసి, బ్రహ్మ నుంచి వరం పొందడం దగ్గర్నుంచి కథను ప్రారంభించాడు. అతను లంకను స్వాధీనం చేసుకోని ముల్లోకాలకు అధిపతి గా మారడం.. ఆ తర్వాత రాముడి జననం.. యోధుడిగా మారడం..సీతా పరిణయం.. వనవాసం.. శూర్పణక పరాభవం, మాయా లేడిని పంపి, సీతని రావణుడు ఎత్తుకు రావడం వరకు పార్ట్ 1లో చూపించాడు. ఇక రావణుడితో రాముడి యుద్ధం పార్ట్ 2లో ఉండబోతుంది.

ఎలా ఉందంటే..
ఇది అందరికీ తెలిసిన కథే. దాన్ని తెరపై ఎలా చూపించారనేది ముఖ్యం. విజువల్స్ పరంగా మ్యాజిక్ చేయాలి. నేటి తరాన్ని సైతం ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలి. ఈ విషయం దర్శకుడి నితీష్ తివారీకి బాగా తెలుసు. అందుకే తెలిసిన, జన బాహుళ్యంలో ప్రచారం ఉన్న రామాయణ కథనే ఎంచుకొని..దానికి విజువల్ ట్రీట్ ఇచ్చాడు. అదే సమయంలో ఎమోషన్స్ కూడా మిస్ కానివ్వలేదు. కానీ ప్రతి విషయం డీటెయిల్డ్ చూపించడంతో నిడివి పెరిగి(దాదాపు మూడు గంటలు) ల్యాగ్ ఫీలింగ్ రావొచ్చు. కొన్ని చోట్ల సీరియల్స్ లా సాగదీసినట్లుగా అనిపిస్తుంది. విజులవ్స్ పరంగా మాత్రం ఈ సినిమా నెక్ట్స్ లెవల్ అని చెప్పొచ్చు. రావణుడితో జాటాయువు పోరాటం చేసే సీన్ ఈ సినిమాకే హైలెట్.

సినిమా న్యూస్

ఓటీటీలోకి జైలర్2..

స్ట్రీమింగ్ డేట్ ఇదే.. అధికారిక ప్రకటన

సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా వచ్చిన లేటెస్ట్ యాక్షన్ మూవీ జైలర్-2. గతంలో రిలీజైన జైలర్‌కు సీక్వెల్‌గా ఈ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. నెల్సన్ దిలీప్ కుమార్ ఈ మూవీకి దర్శకత్వం వహించారు. దసరా కానుకగా గత నెల 15న థియేటర్లలోకి వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ ని షేక్ చేసింది. ఇప్పటికే రూ.800 కోట్ల వసూళ్లకు చేరువలో ఉంది.

నవంబర్ 12 నుం

అయితే ఈ మూవీ మరోసారి ఓటీటీ ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. నవంబర్ 12 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ స్ట్రీమింగ్ కానుంది. ఈమేరకు ప్రైమ్ వీడియో ఈ స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటించింది.కాగా ఈ చిత్రంలో రజనీకాంత్ ప్రధాన పాత్రలో నటించగా.. రమ్యకృష్ణ, యోగిబాబు కీలక పాత్రల్లో కనిపించారు. మిథున్ చక్రవర్తి, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ తదితరులు ఈ చిత్రంలో భాగమయ్యారు. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మించింది. అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందించారు.



రాధికా ఆప్టే వ్యాఖ్యలకు పాయల్ రాజ్‌పుత్ స్ట్రాంగ్ కౌంటర్.. 'టాలీవుడ్ వల్లే ఈ


తెలుగు చిత్ర పరిశ్రమపై నటి రాధికా ఆప్టే చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆమె వ్యాఖ్యలపై పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో నటి పాయల్ రాజ్‌పుత్ స్పందించారు. టాలీవుడ్‌కు మద్దతుగా నిలుస్తూ రాధికా ఆప్టే వ్యాఖ్యలకు గట్టిగా బదులిచ్చారు. తనకు గుర్తింపు, అవకాశాలు ఇచ్చిన తెలుగు చిత్ర పరిశ్రమ గురించి ఇన్నేళ్ల తర్వాత విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడ్డారు. ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడిన పాయల్ రాజ్‌పుత్.. తనకు టాలీవుడ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. గత ఎనిమిదేళ్లుగా తెలుగు చిత్ర పరిశ్రమలో పనిచేస్తున్నానని, ఇక్కడ ప్రతి ఒక్కరికీ ఇచ్చే గౌరవం, కొత్తవారిని ఆహ్వానించే విధానం తనకు ప్రత్యక్షంగా తెలుసని చెప్పారు.




'చంద్రయాన్' నుంచి 'చీఫ్ సైంటిస్ట్' శివ కుమార్ దీకొండ పాత్ర పరిచయం!

ప్రముఖ దర్శకుడు వేణు ఊడుగుల సమర్పణలో, 'సింబ స్క్రీన్ స్టోరీస్' పతాకంపై ప్రవీణ్ మొలక నిర్మిస్తోన్న వైవిధ్యమైన చిత్రం 'చంద్రయాన్' గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ హిలేరియస్ అడ్వెంచర్ కామెడీ సినిమా నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఈ చిత్రం విడుదలకు ఇంకా 8 రోజులే ఉండడంతో పాత్రలను పరిచయం చేస్తుంది చిత్రయూనిట్. ఇందులో భాగంగా హీరోగా నటిస్తున్న శివ కుమార్ దీకొండ పాత్రను చిత్ర యూనిట్ అత్యంత ఆసక్తికరంగా పరిచయం చేసింది. ఈ మిషన్ వెనుక ఉండే అసలు మాస్టర్ మైండ్ మరియు 'చీఫ్ సైంటిస్ట్' అంటూ శివకుమార్ దీకొండ లుక్‌తో కూడిన కొత్త ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు.

సమాజంలో తమని తక్కువ చేసి మాట్లాడిన వారి ముందు తమ ప్రతిభను నిరూపించుకోవాలని నలుగురు గ్రామీణ యువకులు గట్టిగా నిర్ణయించుకుంటారు. ఎవరికీ అంతుచిక్కని ఆలోచనగా సొంతంగా ఒక రాకెట్ తయారు చేసి, ఏకంగా చంద్రమండలానికి వెళ్లాలని వారు సాహసించడమే ఈ చిత్ర ప్రధానాంశం. ఈ క్రమంలో మందమర్రి నుంచి చందమామ వరకు సాగే ఈ ప్రయాణం ఆద్యంతం నవ్వులు పూయించనుంది. శివ కుమార్ దీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, 'బలగం' సత్యనారాయణ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు



సుధీర్ 'గోట్' ట్రైలర్ చూశారా?



సుడిగాలి సుధీర్, దివ్యభారతి ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రం ' ఎమ్ చంద్రశేఖర్ నిర్మాణంలో రూపొందుతోంది. ఈ సినిమా నవంబర్ 12న విడుదల కానుంది. ఈ క్రమంలో ఈ రోజు (గురువారం) ట్రైలర్ విడుదలైంది. దీనిని హీరో దుల్కర్ సల్మాన్ విడుదల చేశారు. క్రికెట్ నేపథ్యంలో తీర్చిదిద్దినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది.

నిర్మాత మాట్లాడుతూ 'సుడిగాలి సుధీర్ కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించిన చిత్రమిది. ఆయన క్రేజ్‌కు తగ్గ కథను ఎన్నుకుని ఈ సినిమా నిర్మించాం. ఆయన పాత్ర నేటి యువత కనెక్ట్ అవుతుంది. టెక్నికల్‌గా కూడా చిత్రం ఉన్నతస్థాయిలో వుంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలుస్తుంది. పూర్తి కమర్షియల్ అంశాలతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నేటి యువతను ఆలోచింపజేసే ఓ మంచి విషయం కూడా దాగి ఉంటుంది' అని అన్నారు.

కాగా చిత్రంలో మొట్ట రాజేంద్రన్, సర్వదమన్ బెనర్జీ, నితిన్ ప్రసన్న, పృథ్వీ, అదుకలం నరైన్, ఆనంద రామరాజు, పమ్మిసాయి, చమ్మక్‌చంద్ర, నవీన్ నేని తదితరులు కీలక పాత్రల్లో నటించారు.


PRINTED , PUBLISHED & " and OWNER By, "S.S.RAO," And PRINTED at JS PRINTRS D.NO.2/720-7/1, -URBAN COLONY,TOWN &MANDAL ATMAKUR,NANDYAL Andhra Pradesh, pin: 518422, And Published At DOOR NO: 5-642,ABBIREDDY COLONY, KAMANAGURUVU VILLAGE,AMALAPURAM MANDAL, DR.B.R.AMBEDKAR KONASEEMA DISTRICT, ANDHRA PRADESH - 533201.,"Email ID," sdudayam@gmail.com" Editor & Pro S.S.RAOR.N.I. NO : APTEL/26/A4267 MOBILE NUMBER: 9440869757, 9160541579

ప్రపంచ మార్కెట్లలో ముందస్తు ప్రకంపనలు: ఆర్థిక మాంద్యం దిశగా అడుగులు?

- నగదు నిల్వల వైపే మొగ్గు చూపుతున్న దిగ్గజ ఇన్వెస్టర్లు- సామాన్యులకు 'ఎమర్జెన్సీ ఫండ్' రక్షణ కవచం: నిపుణుల హెచ్చరిక

ప్రత్యేక ప్రతినిధి: (సత్య దీపిక ఉదయం బ్యూరో)

ప్రపంచవ్యాప్త ఆర్థిక వ్యవస్థలో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. సాధారణంగా స్టాక్ మార్కెట్లు కుదేలైనప్పుడు ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను సురక్షితమైన ఆస్తులుగా భావించే బంగారం, వెండి వైపు మళ్లిస్తుంటారు. అయితే, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి ఈక్విటీలు, క్రిప్టోకరెన్సీలు మాత్రమే కాకుండా, పండుగల వేళ బంగారం, వెండి ధరలు కూడా భారీగా పడిపోవడం ఆర్థిక నిపుణులను విస్మయానికి గురిచేస్తోంది. అంతర్జాతీయంగా తీవ్రమైన ఆర్థిక మాంద్యం (గ్రోబల్ రిసెషన్) ముంచుకొస్తోందన్న సంకేతాలే



ఇందుకు ప్రధాన కారణమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. మార్కెట్ల నుంచి నిధుల ఉపసంహరణ గూగుల్ వంటి గ్లోబల్ టెక్ దిగ్గజాలు ఒక్కరోజే వందల బిలియన్ డాలర్ల మార్కెట్ విలువను కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇన్వెస్టర్లు ఒక రంగం నుంచి మరో రంగానికి పెట్టుబడులను బదిలీ చేయకుండా, మార్కెట్ నుండి మొత్తంగా నిధులను ఉపసంహరించి తమ చేతుల్లో ద్రవ్యరూపంలో (లిక్విడ్ క్యాష్) దాచుకోవడానికే ప్రాధాన్యతనిస్తున్నారు.ప్రపంచ ప్రఖ్యాత ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ సైతం మార్కెట్లు పీక్ లెవెల్స్‌లో ఉన్నప్పుడే షేర్లను విక్రయించి, దాదాపు 400 బిలియన్ డాలర్లను నగదు రూపంలో నిల్వ చేసుకోవడం అంతర్జాతీయ విశ్లేషకులను తీవ్ర ఆలోచనలో పడేసింది.

సామాన్యులపై ప్రభావం ఎంత?

ఆర్థిక మాంద్యం ముదిరితే వాణిజ్య సంస్థలు విస్తరణలను నిలిపివేసి, వ్యయ నియంత్రణ పేరిట పెద్ద ఎత్తున ఉద్యోగాల కోత (లే-ఆఫ్స్) విధించే ప్రమాదం ఉంది. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు వ్యక్తిగత ఆర్థిక భద్రత అత్యంత కీలకమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నిపుణులు సూచిస్తున్న 3 కీలక జాగ్రత్తలు:

1 నుంచి 2 ఏళ్ల ఎమర్జెన్సీ ఫండ్: ఏదైనా కారణం వల్ల ఆదాయం ఆగిపోయినా లేదా ఉద్యోగం కోల్పోయినా ఇంటి అద్దె, ఈఎంఐలు, నిత్యావసరాలకు ఇబ్బంది కలగకుండా కనీసం 12 నుంచి 24 నెలల ఖర్చులకు సరిపడా నగదును బ్యాంక్ పొదుపు ఖాతాలు లేదా సురక్షితమైన ఎఫ్‌డీలలో సిద్ధంగా ఉంచుకోవాలి.

ఖర్చుల తగ్గింపు: ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో ఖరీదైన కొనుగోళ్లు, అప్పు చేసి చేసే విలాసాలను వాయిదా వేసుకోవాలి. భవిష్యత్ సంపద సృష్టికి అవకాశం: మార్కెట్లు అట్టడుగు స్థాయికి పడిపోయిన సమయంలో చేతిలో ద్రవ్య లభ్యత ఉన్నవారికే నాణ్యమైన ఆస్తులను అత్యంత చౌక ధరల్లో సొంతం చేసుకునే గొప్ప అవకాశం లభిస్తుంది.ముందుచూపుతో చేసే పొదుపు, చేతిలో ఉండే అత్యవసర నిధే రాబోయే రోజుల్లో ప్రతి కుటుంబానికి అసలైన ఆర్థిక రక్షణ కవచం కానుంది.





రామాయణ కథ-శుద్ధ పరబ్రహ్మ స్వరూప సాక్షాత్కారసాధన సోపానములు

(గత సంచిక తరువాయి)

సాధకుడు అంతర్ దృష్టితో ముక్తి మార్గాన్ని సమీపించడమే రాముడు కరకంగుని ఆశ్రమాన్ని సమీపించడం అనగా అంతర్ధృష్టితో తను దర్శించినది తన జీవాత్మకు ప్రభోదించడమే లక్ష్మణునకు రాముడు చెప్పడం. అప్పుడు తనకు కనిపించిన రథాన్ని అంటే జీవస్వరూపాన్ని ఆ రథం పై యున్న అధిపతిని అనగా మనస్సును, పరివారాన్ని అనగా ఇంద్రియాసృత్తుల్ని, రథానికి కట్టిన గుర్రాలను అనగా కర్మవాసనలను, సాధకుడు జీవాత్మకు చూపించుతాడు. రథం సూర్యునిలా వెలిగిపోతూ ఉంది అనగా జీవస్వరూపం జ్ఞానప్రకాశంతో నిండిప్రకాశిస్తూ ఉందని అర్ధం. ఆ రథానికి కట్టిన గుర్రాలు పూర్వం తాను విన్నట్టుగానే ఉన్నవి అంటాడు అనగా వేయించిన విత్తుల వలె జనన మరణ శక్తిని కోల్పోయిన కర్మవాసనలు జ్ఞానప్రకాశం పొంది యున్న జీవుణ్ణి నడిపిస్తూ ఉంటాయని జీవన్ముక్తి స్థితిలో కర్మవాసనలు నిమిత్త మాత్రంగా ఉంటాయి అని తెలియుట.రథం మీద దివ్యపురుషులు వందలాది మంది ఉన్నారు. వారు కుండలులు, ఖడ్గప్రాణులు. ఇరవైఅయిదు సంవత్సరాల ప్రాయం వారు అనగా ఇంద్రియవృత్తులు వేలకొలది యుంటాయని. అవి ముక్తపురుషునిలో దివ్యత్వాన్ని పొంది యుంటాయని, కుండలులు అనగా జీవునిలోని కుండలినీ శక్తికి సంబంధించినవై యుంటాయని, ఖడ్గప్రాణి అనగా జ్ఞానఖడ్గంతో రక్షణ చేసుకుంటాయనీ, అవన్నీ 25 సంవత్సరాల ప్రాయం అనగా ఇరవై అయిదు ప్రకృతి తత్త్వాలకు సంబంధించియున్నవని అర్ధం. దేవతలు ఎప్పుడూ ఈ వయసులోనే యుంటారు.రాముడు లక్ష్మణునితో ఇలా అంటాడు నీవు వైదేహితో ఇక్కడే యుండు , నేను శరభంగునితో ఇంద్రుడేమంటున్నాడో సంగతి సందర్భాలు తెలుసుకువస్తాను ఇక్కడే యుండు సుమా ! అని మరలా మరలా రాముడు అంటాడు. వైదేహితో అనగా విదేహ భావవృత్తితో అంటే దేహాత్మ భావం లేకుండా, అనగా దేహం నేను కాను అన్న భావంతో ఉండాలి అని జీవుణ్ణి హెచ్చరించడం అన్నమాట. ఇక్కడే యుండు సుమా ! అని మరలా మరలా చెప్పడమంటే ఇదే ముక్తికి మార్గం. దీన్ని కాదని విడచి దాటి వెళ్ళకూడదు సుమా ! అని హెచ్చరించడం అన్న మాట. జన్మరాహిత్యం కావాలనే అతి తీవ్రమైన తపన యుంటేనే ముక్తి మార్గం కన్పిస్తుంది అని చెప్పడం.

శరభంగుని ఆశ్రమంలోనికి వస్తున్న రాముణ్ణి చూసి ఇంద్రుడు శరభంగుని వద్ద శలవు తీసుకుని వెళ్ళిపోయాడు. అనగా ఆనందాంశ తన్ను వెంబడిస్తూ ముక్తి మార్గం వైపు లాగుకొని వస్తున్న సమయంలో మనస్సు అదృశ్యమైపోతుంది. బ్రహ్మానందస్థితి రాబోతున్నప్పుడు అనమస్క స్థితి సిద్ధిస్తుంది. ఆరోహణామార్గక్రమంతో ముక్తి పొందగోరు వారు తాము ముక్తావస్థకు రాగానే ఇంకా జీవితాన్ని కొనసాగిస్తే ఎక్కడ తిరిగి కర్మవాసనలు అంటుకుంటాయేమోననే భయంతో శరీరాన్ని అగ్నికి ఆహుతి గావించి అనందరూప బ్రహ్మజ్ఞానంతో శరీరాన్ని విడిచి ముక్తిని పొందుతారు. అవరోహణామార్గం అనగా ముక్తావస్థకు వచ్చిన తర్వాత పరిపూర్ణ జ్ఞానం పొంది తిరిగి ఆ జ్ఞానాన్ని మనసులోని ఇంద్రియవృత్తితో ఉండటాన్ని అవరోహణామార్గం అంటారు. ఆరోహణ, అవరోహణా మార్గాలు రెండూ సాధించడం సంపూర్ణ సంయోగ లక్షణం. వీటిని సాధించిన వారు భగవదైక్యం పొందే అవతార పురుషులుగా భావింపబడుతారు. రాముడు శరభంగున్ని తనకు అరణ్యంలో అనుకూల ప్రదేశాన్ని నిర్ణయించవలసినదిగా కోరినప్పుడు శరభంగుడు సుతీక్షాశ్రమాన్ని నిర్దేశిస్తాడు. సుతీక్ష ఆశ్రమ అనగా సు = మంచిని గూర్చి అనగా ముక్తిని గూర్చి తీక్ష = తీవ్రమైనస్థితి అనగా అవరోహణా, ఆరోహణా మార్గాలతోడి పూర్ణయోగానికి సాధించడానికి మిక్కిలి తీక్షణంగా ఇంద్రియాలలో నిశ్చలతను సాధించ దానికి పూర్ణయోగమార్గాన్ని తెలియచెయ్యడమే శరభంగుడు రామునకు సుతీక్షణాశ్రమాన్ని నిర్దేశించడం లోని అంతరార్థం. తర్వాత శరభంగుడు బ్రహ్మలోకానికి వెళ్తాడు.

శరభంగుడు బ్రహ్మలోకానికి వెళ్ళాక పంపానదీ తీరవాసులు, మందాకినీ నదీ తీరవాసులు, చిత్రకూట నివాసులు అయిన మహర్షులు తాము రాక్షసులు చేతపడుతున్న బాధలు చెప్పి, వానిని తొలగించమని రామున్ని కోరతారు. రాముడు వారికి రక్షోవధ చేస్తానని ప్రతిజ్ఞ చేశాడు.పంపానదీ తీరవాసులు అనగా భక్తిమార్గంలో సంచరించే సాధకులు. తనను రక్షించమని భగవంతుని ప్రార్థించే ఉపాసనా మార్గస్థులు. మందాకినీ నదీ తీరవాసులు అనగా కర్మోపాసన మార్గపరులు, మంద + ఆకినీ అనగా మెల్లగా నడిచేది అని అర్థం. ఇది కర్మమార్గ ప్రవృత్తి. కర్మ మనఃశ్శుద్ధిని, మనఃశ్శుద్ధి జ్ఞానాన్ని, జ్ఞానం ముక్తిని క్రమంగా కల్గిస్తాయి. ముక్తి సాధనకు కర్మ మార్గం ప్రప్రథమ సోపానం. ఈ మార్గం నెమ్మదిగా పిపీలికామార్గ క్రమంతో ముక్తిని సాధిస్తుంది. చిత్రకూట వాసులు అనగా జ్ఞానమార్గంలో సాధన చేసేవారు. చిత్ ం త్ర ం కూటం అనగా జ్ఞానంతో కల్గిన నిశ్చలస్థితి సాధించేవారు. జ్ఞానమార్గంలో చివరి సాధన అది.ఈ విధంగా భక్తి, కర్మ, ఉపాసనా జ్ఞానమార్గాలలో పయనం చేసే సాధకులు ఆ సాధనలన్ని టిలోను కూడా విఘ్నాలు ఎదురౌతాయని వానిని పరిశీలించి నాశనం చేయాలని, ఆ విఘ్నాలు దాటాలని సాధకుడు తెలుసుకొని తాను తనలో సుతీక్షణ మార్గంలో ధృడదీక్ష వహించడం అనేది రాముని రక్షోవధా ప్రతిజ్ఞలోని అంతరార్థం.

రాముడు శరభంగుని సూచన ప్రకారం సుతీక్ష మహర్షి ఆశ్రమం చేరుకున్నాడు. సుతీక్ష మహర్షి రామునితో నా ఆశ్రమం చక్కని గుణములు కలది. ఇక్కడ ఆనందించవచ్చు. పెద్ద పెద్ద మృగాల గుంపులు వచ్చి పోతూ యుంటాయి. అవి ఎవ్వరికీ హాని చేయవు. భయం యుండదు. ప్రలోభాన్ని కల్గించి పోతుంటాయి. ఇక్కడ ఏ బాదయుండదు అని చెప్పాడు.సాధన తీవ్ర స్థాయిలో జరుగుతున్నప్పుడు ప్రత్యేకంగా బాధించే, క్షోభపెట్టే ఆటంకాలు ఏమీ యుండవనీ, ప్రలోభాలకు, భ్రాంతులకు సంబంధించిన భావాలు మాత్రం వచ్చి పోతుంటాయి.తప్ప వాటి వల్ల ఇబ్బంది యుండదని అర్థం.సాధకుడు సుతీక్షణుని సన్నిధానంలో సాధనలో అతి తీవ్ర సాధన సులభంగానే ప్రలోభాలను త్రోసి వేయగల్గుతాడనీ, సాధనలో తీక్షణత యున్నంత వరకు ఏ విఘ్నాలు బాధించవని, ఈ సాధన కూడా ఎంతోకాలం చేయవలసిన పనికూడా యుండదని అర్థం. (ఇంకా ఉంది)

(ఇంకా ఉన్నది)

జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్

- తుది అంచనా ప్రకారం 64--65 శాతం పోలింగ్ నమోదు అయ్యే అవకాశం...- నవంబర్ 7న నాలుగు కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు.

అమలాపురం, నవంబర్ 05 (సత్య దీపిక ఉదయం విలేకరి) :

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. తుఫాను, భారీ వర్షాల ప్రభావం ఉన్నప్పటికీ ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల నిర్వహణలో అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసిందని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ తెలిపారు.జిల్లాలోని 19 జెడ్పీటీసీ స్థానాలకు 75 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. మొత్తం 379 ఎంపీటీసీ స్థానాలకు గాను 7 స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 372 స్థానాలకు 885 మంది అభ్యర్థులు పోటీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,294 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించారు. సాయంత్రానికి సుమారు 62 శాతం పోలింగ్ నమోదుకాగా, తుది నివేదికల అనంతరం 64 నుంచి 65 శాతానికి చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.తుఫాను, భారీ వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో ఓటర్ల రాకపోకలకు ఆటోలు, ట్రాక్టర్లు, పడవలను ఏర్పాటు చేశారు. ప్రతికూల వాతావరణంలోనూ పోలింగ్ సజావుగా జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు.పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బాక్సులను పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురంలోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. నవంబర్ 7వ తేదీన నాలుగు కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.ఎన్నికల భద్రత కోసం 750 మంది పోలీసులతో పాటు అదనపు బలగాలను మోహరించినట్లు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. బ్యాలెట్ బాక్సుల తరలింపునకు 120 రూట్లలో పోలీసు ఎస్కార్ట్ వాహనాలు, స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు.మరోవైపు తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేశారు. జిల్లాలో 872 ఆవాసాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. తాగునీటి పథకాలు, ఆక్వా రైతుల విద్యుత్ కనెక్షన్ల పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.ఎన్నికల నిర్వహణకు సహకరించిన అధికారులు, సిబ్బంది, ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులకు జిల్లా కలెక్టర్, ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.



గోకవరం మండలంలో 69.21 శాతం పోలింగ్

- మహిళా ఓటర్లే అధికం.. 39,834 ఓట్లు నమోదు

గోకవరం నవంబర్ 5 సత్య దీపిక ఉదయం

గోకవరం మండలంలో గురువారం నిర్వహించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 61 పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 5 గంటల వరకు 69.21 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించిన వివరాలు వెల్లడిస్తున్నాయి. మండలవ్యాప్తంగా మొత్తం 57,553 మంది ఓటర్లు ఉండగా, వారిలో 39,834 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 19,807 మంది పురుషులు, 20,027 మంది మహిళలు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 220 మంది అధికంగా ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. పోలింగ్ వివరాలను పరిశీలిస్తే గంగంపాలెం పరిధిలోని ఒక పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 85.66 శాతం పోలింగ్ నమోదు కాగా, గంగంపాలెం పరిధిలోని మరో కేంద్రంలో 84.85 శాతం నమోదైంది. మరోవైపు కొన్ని పోలింగ్ కేంద్రాల్లో 50 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. మొత్తంగా మండలంలో మహిళా ఓటర్లు ఉత్సాహంగా పాల్గొనడంతో పోలైన ఓట్లలో వారి సంఖ్య పురుషుల కంటే అధికంగా నమోదైందని ఎంపీడీవో గోవింద్ తెలిపారు

ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీపీ, జెడ్.పి.టి.సి అభ్యర్థులు

తాళ్లపూడి 5 నవంబర్ సత్యదీపిక ఉదయం: తాళ్లపూడి ఎంపీపీ అభ్యర్థి నామా నాగ శంకర రాణి తన ఓటును ఆమె స్వగ్రామం తాడిపూడి పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. కాగా తాళ్లపూడి మండల జెడ్పి. టి.సి. అభ్యర్థి కొక్కిరిపాటి అనంతంలక్ష్మి పెద్దేవం గ్రామంలో తన ఓటు హక్కును నియోగించుకున్నారు.



వీల్ చైర్ ల వినియోగం భేష్ ఎన్నికల నేపధ్యంలో నడవలేని వారికీ కదల లేని వారికి ఓటు హక్కు వినియోగించు కునేందుకు వీల్ చైర్ ను సరఫరా చేస్తారు. తాళ్లపూడి మండలంలో అనేక మంది వీటిని వినియోగించు కున్నారు

మందమర్రిలో పోలీసుల ఆకస్మిక వాహన తనిఖీలు

- 13 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు
- 43 వాహనదారులకు ఈ-చలాన్లు..
- మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ హెచ్చరిక

మందమర్రి,సత్యదీపిక ఉదయం : పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో గురువారం సాయంత్రం బెల్లంపల్లి సబ్ డివిజన్ ఏసీపీ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 13 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, వారి వాహనాలను సీజ్ చేశారు. అదేవిధంగా హెల్మెట్ ధరించకపోవడం, సరైన వాహన పత్రాలు లేకపోవడం తదితర ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన 43 మంది వాహనదారులకు ఈ-చలాన్లు విధించారు.ఈ సందర్భంగా ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వాడ వరద నీటితో అల్లలాడుతున్న రైతాగం, గ్రామాలు

తాళ్లపూడి 5 నవంబర్ సత్యదీపిక ఉదయం:

కొవ్వాడ వరద నీటి తాకిడి తాళ్లపూడి మండలంలో అనేక గ్రామాలుకు తగిలింది. గజ్జరం,అన్నదేవరపేట, పోచవరం, తాడిపూడి, తిరుగుడుమెట్ట గ్రామాల్లో వందలాది ఎకరాలు నీట



మునిగాయి. తిరుగుడుమెట్ట ప్రధాన రహదారి పై కొవ్వాడ వరద నీరు ప్రవహించటంతో కనీసం గ్రామంలోకి వెళ్లే రహదారి లేక ట్రాక్టర్ పై వెళ్లే పరిస్థితి నెలకొంది. రాగోలపల్లి తాడిపూడి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. అన్నదేవరపేటలోని కాల్వ ప్రక్క గల జాన్ పేట, ఇందిరమ్మ పేట, అరుంధతీయపేట వీధుల్లోకి నీరు చేరింది. పోచవరం పంచాయతీ పరిధిలో రాగోలపల్లి యస్సి కాలనిలో సుమారు ఎనిమిది ఇళ్ళలోకి నీరు చేరింది. ఆ ఇళ్లల్లో వృద్దులుండి ఇబ్బందులు పడ్డారు. తిరుగుడుమెట్ట గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టింది. పండల ఎకరాలు నీటిలో మునిగిపోయాయి. గ్రామానికి గల ప్రధాన రహదారి బండ్ అయ్యింది.నిత్యావసరాల పంపిణీ.. తహసీల్దార్ వెల్లడి వరద తాకిడి గురయ్యే ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామస్థులను పిలిచినా రావటం లేదని ప్రమాదం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తాళ్లపూడి తహసీల్దార్ లక్ష్మీ లావణ్య తెలిపారు.



కాళేశ్వరం పునరుద్ధరణకు నిపుణులే దిక్సూచి!

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పనుల్లో శాస్త్రీయ ప్రమాణాలు పాటించాలి
- కేంద్ర సంస్థలు, డ్యామ్ సేఫ్టీ నిపుణుల సూచనలతోనే ముందుకెళ్లాలి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాదు,సత్యదీపిక ఉదయం :

కేంద్ర ప్రభుత్వ సంస్థలు, డ్యామ్ సేఫ్టీ నిపుణుల సూచనల ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు చేపట్టాలని ముఖ్యమంత్రిఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.దెబ్బతిన్న మూడు బ్యారేజీలను సురక్షితంగా తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రులు, నీటిపారుదల శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.మేడిగడ్డ వద్ద నీళ్లున్నప్పటికీ వాటిని లిఫ్ట్ చేయడం లేదనే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రులకు సూచించారు. అక్కడ కనిపిస్తున్న నీటిని ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో సాంకేతికంగా లిఫ్ట్ చేయడం సాధ్యం కాదని నీటిపారుదల శాఖ ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు.మేడిగడ్డ నుంచి లిఫ్ట్ చేసిన నీళ్లు ఎల్లంపల్లికి చేరాలంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను మూసివేయాల్సి ఉంటుందని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.అయితే, నిర్మాణ లోపాలున్న అన్నారం,సుందిళ్ల బ్యారేజీల గేట్లను తెరిచే



ఉంచాలని ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరించిన విషయాన్ని గుర్తుచేశారు.దిగువ గోదావరి నీరు వృథాగా పోకుండా దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా నీటిని లిఫ్ట్ చేసినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. దీంతో ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఆయకట్టుకు సాగునీరు, తాగునీటిని అందించామన్నారు.గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున **9.57** టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే.. ఈ మూడేండ్లలో సగటున **18.13** టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసినట్లు చెప్పారు. గతంతో పోలిస్తే **89** శాతం అధికంగా గోదావరి జలాలను వాడుకున్నట్లు వివరించారు. అక్టోబర్? నాటికి దేవాదుల ద్వారా **16.71** టీఎంసీలు, సీతారామ ద్వారా **8.10** టీఎంసీలు లిఫ్ట్ చేసి **24.81** టీఎంసీల గోదావరి జలాలను సద్వినియోగం చేసుకున్నామని వివరించారు.

ఈ సమావేశంలో మూడు బ్యారేజీల పునరుద్ధరణకు రూపొందించిన ప్రణాళికను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు వివరించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ విస్తీర్ణం పెరిగిందని, వరి దిగుబడిలో దేశంలోనే రికార్డు సాధించామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.గత ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగానే మేడిగడ్డ కుంగిపోయిందని, బ్యారేజీల కుంగిపోవడానికి దారితీసిన కారణాలను వివరించారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ప్రాణహిత ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే కరువు పరిస్థితుల్లోనూ ఇబ్బందులు ఉండేవి కావని, ప్రాణహిత నీటిని తక్కువ ఖర్చుతో ఎల్లంపల్లికి తీసుకువచ్చే అవకాశం ఉండేదని అన్నారు.మూడు బ్యారేజీల పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పనులను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. బ్యారేజీల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (NDSA) మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. అవసరమైన అనుమతులను త్వరితగతిన పొందేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థలతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్న తర్వాత మూడు బ్యారేజీల పరిస్థితిపై ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేయించినట్లు అధికారులు వివరించారు. జాతీయ స్థాయి నిపుణులు, కేంద్ర ప్రభుత్వ సాంకేతిక సంస్థల సహకారంతో అవసరమైన పరిశోధనలు పూర్తి చేసినట్లు తెలిపారు. పునరుద్ధరణకు సంబంధించిన ప్రాథమిక ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని వివరించారు.మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులకు దాదాపు రూ.**4,193** కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. నిర్మాణ లోపాలకు సంబంధించిన మరమ్మతుల వ్యయాన్ని నిర్మాణ సంస్థలే భరించేలా, అదనపు పనుల వ్యయాన్ని ప్రభుత్వం భరించేలా ప్రతిపాదించినట్లు వివరించారు. పనుల్లో జాప్యం జరగకుండా అన్ని ప్రక్రియలను సమాంతరంగా కొనసాగించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.పునరుద్ధరణ పనులకు సంబంధించిన తుది అనుమతులను ఈ నెలాఖరులోగా పొందేందుకు ప్రయత్నించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఏడాది చివరిలోగా పనులు ప్రారంభించాలన్నారు. బ్యారేజీల నీటి వినియోగ సామర్థ్యాన్ని పునరుద్ధరించే పనులతో పాటు రక్షణ పనులను రెండు దశలుగా విభజించుకోవాలని చెప్పారు.బ్యారేజీల భద్రతకు సంబంధించిన ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, నిర్మాణ సంస్థల మధ్య సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, టన్నెల్స్ అండ్ సేఫ్టీ కార్యదర్శి కల్నల్ పరీక్షిత్ మెహ్రో, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

- ఉద్యోగులకు ఫేషియల్ అటెండెన్స్ తప్పనిసరి - లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి- జిల్లా కలెక్టర్ రాజర్షి షా - కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సుదీర్ఘ సమీక్ష

అదిలాబాదు ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :



జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఎల్ నినో నేపద్యంలో తాగునీటి సరఫరా, మిషన్ భగీరథ పనులు, ఉపాధి హామీ, ఇందిరమ్మ ఇళ్లు, విద్యుత్ ఆదా, మీ ప్రమాణం యాప్ ద్వారా ఉద్యోగుల హాజరు, అంగన్వాడీ, వివో, గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, మొక్కల పెంపకం, తదితర కీలక అంశాలపై ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.ముందుగా తాగునీటి సరఫరాపై కలెక్టర్ సమీక్షిస్తూ, గత ఏడాదితో పోలిస్తే ఈసారి భూగర్భ జలాలు పడిపోయినందున తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని మిషన్ భగీరథ, ఇరిగేషన్ శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజలకు, మూగజీవాలకు తాగునీరు అందించడమే ప్రథమ ప్రాధాన్యతగా ఉండాలని స్పష్టం చేశారు. నవంబర్ **15** నుంచి ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి, గ్రామాల్లోని తాగునీటి వనరులు, విద్యుత్ సమస్యలు, మోటార్లు, పైప్‌లైన్ల లీకేజీలు, బోర్లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే అధికారులే అందుకు బాధ్యులు అని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఏఈలు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనవసర విద్యుత్ వినియోగం కాకుండా, నీటి సంరక్షణ, పారిశుద్ధ్యంతో పాటు విద్యుత్ ఆదా చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామ పంచాయతీ నిధులను అనవసర ఖర్చులకు వినియోగించవద్దని, వీధి దీపాల విద్యుత్ ఆదా కోసం కేవలం 'మూడో వైరు అనుసంధానానికి మాత్రమే నిధులు వెచ్చించాలని స్పష్టం చేశారు. ఈ థర్డ్ వైర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని, లక్ష్యాలు చేరుకోని వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అలాగే, విద్యుత్ షాక్ వంటి ప్రమాదాలకు తావివ్వకుండా, గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను వెంటనే గుర్తించి మార్చాలన్నారు.ఉపాధి హామీ పథకం పనుల్లో వేగం పెంచాలని, డిసెంబర్, జనవరి మాసాల నాటికి కూలీల హాజరు శాతం కచ్చితంగా పెంచాలని ఆదేశించారు. గ్రామాల్లో ఫామ్ పాండ్స్, ఇంకుడు గుంతలు, బోర్ వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్స్, పశువుల నీటి తొట్ల నిర్మాణ పనులను నవంబర్, డిసెంబర్ నాటికి వంద శాతం పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సంబంధించి వెరిఫికేషన్ ప్రక్రియను అధికారులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, జిల్లా వ్యాప్తంగా పశువులు, గొర్రెలకు వ్యాక్సినేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని పశు సంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. పశువుల మేత కోసం పశుగ్రాసం పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగులందరూ విధిగా 'మీ ప్రమాణం' మొబైల్ యాప్ ద్వారానే ఫేషియల్ అటెండెన్స్ నమోదు చేసేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని కార్యాలయాల పరిధిని గూగుల్ మ్యాప్స్ ద్వారా జియో ఫెన్సింగ్ చేయాలని, అడ్మిన్ లాగిన్ ద్వారా ఉద్యోగుల వివరాలను నమోదు చేసి ప్రతి ఒక్కరూ కచ్చితంగా యాప్ లోనే హాజరు వేసేలా చూడాలని స్పష్టం చేశారు.జిల్లాలోని ఇరిగేషన్ కెనాల్స్, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల మరమ్మతులు, పూడికతీత పనులకు ఉపాధి హామీ నిధుల కింద అంచనాలు రూపొందించి, వేసవికి ముందే డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. మంజూరై ఇంకా ప్రారంభం కాని గ్రామ పంచాయతీ, వైకుంఠధామాలు తదితర పనులను వెంటనే రద్దు చేసి అవసరమైన చోట కొత్త ప్రతిపాదనలు పంపాలని, అలాగే నిర్మాణ దశలో ఉన్న అంగన్వాడీ భవనాలను డిసెంబర్ కల్లా పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మురుగు నీటి సమస్యల పరిష్కారానికి సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జెడ్పీ సీఈఓ రవి, డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, విద్యుత్ శాఖ ఎస్ఈ సుభాష్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి మిల్కా, మిషన్ భగీరథ ఎస్ఈ శ్రవణ్ కుమార్, హౌసింగ్ పీడీ శంకర్, భూగర్భజల శాఖ ఏడీ సతీష్ కుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామారావు, డీపీఓ రమేష్, పంచాయతీ రాజ్ ఈఈ శివరామ్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ తనాజీ, ఈడీఎం రవి, వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, సీడీపీఓలు, విద్యుత్ శాఖ ఏఈలు, ఇతర జిల్లా స్థాయి, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న పెళ్లి కొడుకు!

అంబాజీపేట, నవంబర్ 5 (సత్యదీపిక ఉదయం)

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరంలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. 41వ నంబర్ పోలింగ్ బూత్‌లో పాలంగి అఖిల్ అనే పెళ్లి కుమారుడు తన వివాహ ముహూర్తం వేళ కూడా బాధ్యతను మరువకుండా పెళ్లి దుస్తుల్లోనే భార్యను వెంటబెట్టుకుని పోలింగ్



కేంద్రానికి వచ్చి తన ఓటు హక్కును వినియోగించుకున్నాడు.పెళ్లి దుస్తుల్లో వచ్చిన అఖిల్‌ను చూసి స్థానికులు, తోటి ఓటర్లు ఒకింత ఆశ్చర్యానికి గురియైనా తేరుకొని అభినందించారు. ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ.. జీవితంలో పెళ్లి ఎంత ముఖ్యమో, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వదులుకోకూడదని, అర్హులైన యువతీ యువకులందరూ తప్పనిసరిగా ఓటు వేయాలని పిలుపునివ్వడం విశేషం.పెళ్లి సందడిలోనూ ఓటు వేయడానికి ప్రాధాన్యత ఇచ్చిన అఖిల్ పలువురికి ఆదర్శంగా నిలిచాడు.

కొవ్వాడ వరద నీటిలో వ్యక్తి గల్లంతు

తాళ్లపూడి 5 నవంబర్ సత్యదీపిక ఉదయం:

కొవ్వాడ వరద నీటిలో ఓ వ్యక్తి గళ్ళంతయినట్లు సమాచారం అందింది. అన్నదేవరపేట బ్యాంకు అఫ్ ఇండియాలో పని చేస్తున్న మేడిద విజయకుమార్ అని గ్రామస్థులు వెల్లడిస్తున్నారు. ఓటు వేయడానికి చిట్యాల వెళ్లి అన్నదేవరపేట బైక్ పై వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం.ఈయనతో పాటు మరో వ్యక్తి వరద నీటిలో చెట్టును పట్టుకుని రక్షించబడిందని తెలుస్తోంది.

కష్టానికి గుర్తింపు.. డిస్ట్రిబ్యూటర్లకు ప్రోత్సాహం.

- రూ.12 వేల విలువైన 101 ఉత్పత్తుల పంపిణీ

జన్నారం, నవంబర్ 05,సత్యదీపిక ఉదయం :

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామ పంచాయతీలో గురువారం ఏడీఎంఎస్ డిస్ట్రిబ్యూటర్లకు రూ.12 వేల విలువైన 101 ఉత్పత్తులను బహుమతిగా గురువారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ గుగ్లావత్ సంగీత చేతుల మీదుగా, పంచాయతీ కార్యదర్శి కల్యాణి సమక్షంలో నలుగురు డిస్ట్రిబ్యూటర్లకు ఈ ఉత్పత్తులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గుగ్లావత్ సంగీత మాట్లాడుతూ.. ఏ రంగంలోనైనా కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు, ప్రోత్సాహం లభించడం ఎంతో అవసరమన్నారు. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదల, నిబద్ధతతో ముందుకు సాగితే అనుకున్న విజయాలను సాధించవచ్చని పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూటర్లు తమ పనిపై నమ్మకంతో, ఐకమత్యంతో ముందుకు సాగాలని, ఒకరికొకరు సహకరించుకుంటూ అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఎలక్ట్రిక్ వాహనాన్ని బుక్ చేసుకున్న వారికి రూ.12 వేల విలువైన ఉత్పత్తిని ఉచితంగా అందించడం డిస్ట్రిబ్యూటర్లకు అదనపు ప్రోత్సాహంగా నిలుస్తుందన్నారు. ఏడీఎంఎస్ సంస్థ నిర్దేశించిన "వన్ ఇయర్ వన్ సీఆర్" లక్ష్యంతో నెట్‌వర్క్ రంగంలో పనిచేస్తున్న వారు ప్రణాళికాబద్ధంగా, క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. ఇలాంటి ప్రోత్సాహకాలు మరింత మంది ముందుకు రావడానికి దోహదపడతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కమ్మల భూమయ్య, కోర్ కమిటీ సభ్యులు కామర వెంకటస్వామి, డిస్ట్రిబ్యూటర్లు కుక్కటి కారు రమేష్, దేవ రాజమౌళి, కుక్కటికారు రవితేజ, రేగుంట సుదర్శన్, రేగుంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాల ఆర్‌టీసీ డిపోలో ఏఐటియూసీలో చేరిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు, కండక్టర్లు

- ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి
- మేకల దాసు ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

మంచిర్యాల,సత్యదీపిక ఉదయం :

మంచిర్యాల ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు మరియు కండక్టర్లు ఏఐటియూసీ కార్మిక సంఘంలో చేరారు. ఈ సందర్భంగా వారిని ఏఐటియూసీ నాయకులు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్లు, కండక్టర్లు పనిచేస్తూ సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ వారికి ఉద్యోగ భద్రత లేకపోవడం,సమయానికి వేతనాలు ఇవ్వకుండా, తక్కువ వేతనాలు, పని ఒత్తిడి, ఇతర సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు, కండక్టర్లకు ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కార్మిక చట్టాల ప్రకారం అన్ని హక్కులు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటియూసీ నిరంతరం పోరాటం చేస్తుందని, కార్మికులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ అధ్యక్షులు మామిడిపల్లి శ్రీనివాస్, డిపో కార్యదర్శి గోలి శంకర్ ,శంకరాచారి , అంజయ్య, నర్సింహా, రాజు, భారతి ,సుమలత పానుగంటి సత్యనారాయణ లు పాల్గొన్నారు.





జాతీయ తెలుగు దినపత్రిక

సత్య దీపిక

ఉదయం

www.satyadeepikaudayam.com

తెలంగాణ ప్రజల గొంతుక ..నిజాలు వెలుగుల్లోకి

డిగ్రీలు లేకున్నా..

కలానికి తిరుగులేని పదును!



చదివింది తక్కువైనా..
...అక్షరాల కూర్పులో నేర్పరి!
..పెద్దగా చదువుకోలేదు.. కానీ పుస్తకాల్లోని అక్షరాలనే కాదు, జీవితంలోని అనుభవాలను కూడా అక్షరాలుగా మలిచిన అద్భుత ప్రతిభావంతుడు!

8లో

తెలంగాణ సాహితీ శిఖరం దాశరథికి సీఎం రేవంత్ రెడ్డి ఘన నివాళి

హైదరాబాదు,సత్యదీపిక ఉదయం :

తెలంగాణ సాహితీ సౌరభం, సంఘ సంస్కర్త దాశరథి కృష్ణమాచార్య వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ మహనీయునికి ఘనంగా నివాళు



లర్పించారు. “నా తెలంగాణ కోటి రత్నాల వీణ” అంటూ తెలంగాణ వైభవాన్ని, ఆత్మగౌరవాన్ని తన అక్షరాల్లో ఆవిష్కరించిన మహాకవి అని స్మరించుకున్నారు.కలం ద్వారా కదనరంగాన్ని తలపించేలా, కవిత్వంతో ప్రజల్లో చైతన్య జ్వాలలు రగిలించి, తన సాహిత్యాన్ని తెలంగాణ విముక్తి పోరాటానికి అంకితం చేసిన అక్షర యోధుడు దాశరథని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన గళాన్ని వినిపించి, జైలు గోడల మధ్యన సైతం తన కలాన్ని ఆపని ధైర్యశాలి అని కొనియాడారు.అగ్నిధార, రుద్రవీణ వంటి రచనలతో తెలుగు సాహిత్యానికి చెరగని కీర్తిని అందించిన దాశరథి ఉద్యమ స్ఫూర్తిగా, సామాజిక చైతన్యంగా, తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు.



ఎన్‌డీఆర్ఎఫ్,ఎస్‌డీఆర్ఎఫ్ ఇతర సహాయక బృందాలను

అభినందించిన ముఖ్యమంత్రి

సిబ్బంది ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అంకితభావం ప్రశంసనీయం

హైదరాబాదు,సత్యదీపిక ఉదయం :

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో గల్లంతైన మత్స్యకారులు, వారిని రక్షించేందుకు వెళ్లి చిక్కుకుపోయిన పలువురు ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు చేపట్టిన సహాయక చర్యల్లో పాలుపంచుకున్న ఎన్‌డీఆర్ఎఫ్ ((NDRF), ఎస్‌డీఆర్ఎఫ్ (SDRF), అగ్నిమాపక సిబ్బందికి, అధికారులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.భారీ వర్షాల కారణంగా పొంగిపొర్లుతున్న బేతుపల్లి చెరువులో చిక్కుకున్న మత్స్యకారులు, వారిని కాపాడటానికి వెళ్లిన ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది అందరూ సురక్షితంగా బయటపడేందుకు (NDRF, ఇతర సహాయక బృందాలు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో చేసిన కృషి అభినందనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సిబ్బంది ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అంకితభావం ప్రశంసనీయమని అన్నారు. సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు.

ప్రజా శ్రేయస్సులో భాగంగా బియ్యం

ధరల నియంత్రణ

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

ప్రజా శ్రేయస్సులో భాగంగా ప్రభుత్వం బియ్యం ధరల నియంత్రణ చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో సమత రైస్ డిపో వారు ఏర్పాటు చేసిన బియ్యం అమ్మకాల అవుట్ లెట్ ను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా



మేనేజర్ శ్రీకళ, మండల తహసిల్దార్ వనజ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట ధరలకు మించి అమ్మకాలు జరుపకూడదని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్ లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ నిర్ణీత ధరకే విక్రయాలు జరిగేలా రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన ప్రీమియం క్వాలిటీ బి.పి.టి. న్యూ రైస్ బ్యాగ్ ను 1 వేయి 352 రూపాయలు, స్టీమ్ రైస్ ను 1 వేయి 482 రూపాయలు, పాత బియ్యం 1 వేయి 638, హెచ్.ఎం.టి. పాత రకం బియ్యం బస్తా 1 వేయి 950 రూపాయలు, జై శ్రీరామ్ పాత బియ్యం 1 వేయి 976 రూపాయల చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయాలు జరుపుతామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల

ఔషధాల నిల్వకు

ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ ప్రతినిధి, సత్యదీపిక ఉదయం

ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన ఔషధాలను వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) భవనంలో నిల్వ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కేంద్రంలోని టగుల్జార్ మార్కెట్ ఏరియాఊ వైద్య విధాన పరిషత్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం వైద్య కళాశాల అనాటమీ విభాగంలో నిల్వ ఉంచిన ఔషధాలను అవసరాలకు అనుగుణంగా టీవీవీపీ భవనానికి తరలించాలని సూచించారు. ఔషధాల అవసరం, ప్రాధాన్యత ఆధారంగా క్రమబద్ధంగా నిల్వ చేయాలని, వాటి సరఫరా, నిర్వహణకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవాలని ఆదేశించారు.ఔషధాలు పాడవకుండా సురక్షితమైన ప్రదేశంలో భద్రపరచాలని, నిల్వ కేంద్రానికి అవసరమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, డీసీహెచ్ఎస్ కాశీనాథ్, అధికారులు సౌమ్య, వంశీ మాధవ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ‘ఉన్నతి విద్య’ దోహదం

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం: కలెక్టర్ రాజర్షి షా



అదిలాబాదు ప్రతినిధి,సత్యదీపిక ఉదయం

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారిలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు సర్వతోముఖాభివృద్ధికి ‘ఉన్నతి విద్య’ కార్యక్రమం దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని మసూద్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలక్‌మందిర్) పీఎం శ్రీ పాఠశాలలో ‘ఉన్నతి విద్య’ కార్యక్రమాన్ని కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ‘ఉన్నతికి బాట.. విద్యతో ప్రయాణం -- అభ్యసనం, అభివృద్ధి, విజయం’ అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు పటిష్టమైన విద్యా పునాది కల్పిస్తే భవిష్యత్తులో ఉన్నత



శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.అనంతరం కలెక్టర్ పాఠశాల తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠ్యాంశాలపై వారి అవగాహనను పరీక్షించడంతో పాటు బోధనా విధానాలు, పాఠశాలలో అందుబాటులో ఉన్న వసతుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సందేహాలకు సమాధానాలిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం నింపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, సెక్టోరల్ అధికారులు లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే ను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల,నవంబర్ 5, సత్యదీపిక ఉదయం :

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల



సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్ లతో కలిసి సర్వేయర్లకు జి.ఎన్.ఎస్.ఎస్. రోవర్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, సంబంధిత రైతులకు ముందుగా సమాచారం అందించి, ప్రతి రైతు రీ సర్వేలో హాజరయ్యే విధంగా టామ్ టామ్ ద్వారా తెలియజేయాలని తెలిపారు. రీ సర్వే ద్వారా భవిష్యత్తులో భూ సమస్యలు ఉండవని తెలిపారు. ప్రక్రియ నిర్వహణ కొరకు సర్వేలో వినియోగించే 12 రోవర్లను అందించడం జరిగిందని, వీటి ద్వారా ఖచ్చితమైన సర్వేను చేపట్టడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాగమంచు నేపథ్యంలో

ప్రత్యేక వాహన తనిఖీలు

- 220కి పైగా వాహనాల తనిఖీ.. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు రూ.1.20 లక్షల జరిమానాలు



8లో

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, లక్ష్యసాధనకు

వ్యక్తిత్వ వికాస శిక్షణ దోహదం

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అదిలాబాదు ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

విద్యార్థులు చిన్నతనం నుంచే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణతో





చదువుతూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. పట్టుదల, సానుకూల దృక్పథం అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు.గురువారం మావల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ‘ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ ఫౌండేషన్’ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు, చేస్తున్న త్యాగాలను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని, వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. మనసులోని భయాలను వీడి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే ఏ రంగంలోనైనా విజయాలు సాధించవచ్చని తెలిపారు.జీవితంలో లక్ష్య నిర్దేశం, మానవతా విలువలు, వేదికపై మాట్లాడే భయాన్ని అధిగమించడం, సానుకూల ఆలోచనా విధానం, జ్ఞాపకశక్తిని పెంపొందించే మెమరీ టెక్నిక్స్ తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఇలాంటి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని తమలోని ప్రతిభను వెలికితీసుకోవాలని



సూచించారు.అనంతరం ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థినుల ఆరోగ్య వివరాలతో రూపొందించిన హెల్త్ ప్రొఫైల్ పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సాధన, కేజీబీవీ ప్రత్యేకాధికారి సువర్ణ, సెక్టోరల్ అధికారి సరిత, ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ ఫౌండేషన్ డైరెక్టర్లు రంజిత్, రాము, సుధాకర్, వైద్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు

సీఓఈ బెల్లంపల్లి విద్యార్థులు

- ఐదుగురు విద్యార్థుల ఎంపికపై ప్రిన్సిపాల్ అఖిల విజయసాగర్ హర్షం.


బెల్లంపల్లి, నవంబర్ 05, సత్య దీపిక ఉదయం:

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) బెల్లంపల్లికి చెందిన ఐదుగురు విద్యార్థులు అండర్-19 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్ 1వ తేదీన నిర్వహించిన బెల్లంపల్లి జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థుల్లో బి. వినయ్ కుమార్ (సెకండ్ ఎంపీసీ), ఆర్. ప్రణవ్ (సెకండ్ ఎంపీసీ), టి. రాజేష్ (ఫస్ట్ బైపీసీ), వి. విష్ణేష్ (ఫస్ట్ బైపీసీ), కె. సిద్ధార్థ (ఫస్ట్ ఎంపీసీ) ఉన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు సికింద్రాబాద్‌లోని సైనిక్‌పురిలో గల భవానీ శ్రీ అరబిందో జూనియర్ కళాశాలలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ అండర్-19 కార్యదర్శి బి. బాబురావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అఖిల విజయసాగర్ మాట్లాడుతూ సీఓఈ బెల్లంపల్లి నుంచి ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఎంతో సంతోషకరమన్నారు. క్రీడలు విద్యార్థుల్లో మానసిక ధైర్యం, క్రమశిక్షణ, పట్టుదలను పెంపొందిస్తాయని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావాలని విద్యార్థులకు సూచించారు. మంచిర్యాల జిల్లా డీఐఈఓ అంజయ్య విద్యార్థులను అభినందిస్తూ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తన్నీరు గోపి, కమలాకర్, మల్లికార్జున్, అఖిల్, జ్యోతి మేడం, శివ తేజస్విని మేడం తదితరులు విద్యార్థులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, ముచ్చకుర్తి రాజశేఖర్ విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి ఆల్ ది బెస్ట్ తెలిపారు.



చదివింది తక్కువైనా.. అక్షరాల కూర్పులో నేర్పరి!

చదువు తక్కువ.. అక్షరాలపై అపారమైన పట్టు! అక్షరాలతో అద్భుతాలు చేసే అరుదైన ప్రతిభావంతుడు!



పెద్దగా చదువుకోలేదు.. కానీ పుస్తకాల్లోని అక్షరాలనే కాదు, జీవితంలోని అనుభవాలను కూడా అక్షరాలుగా మలిచిన అద్భుత ప్రతిభావంతుడు! దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామానిక చెందిన జంబోజు లింగమూర్తి పై ప్రత్యేక కథనం ...

మనిషి గొప్పతనాన్ని కొలవడానికి చదువుకున్న డిగ్రీలే కొలమానం కావు. ఎంతటి ఉన్నత విద్యను అభ్యసించాడన్నది ఒక అంశమైతే, తనకు వచ్చిన జ్ఞానాన్ని ఎంత సమర్థంగా ఉపయోగించగలిగాడన్నది మరో అంశం. కొంతమంది ఉన్నత విద్యను అభ్యసించి కూడా తమ ఆలోచనలను అక్షరాల్లో వ్యక్తీకరించలేకపోతారు. మరికొందరు పెద్దగా చదువుకోకపోయినా అక్షరాలపై అసాధారణమైన పట్టును సంపాదించి, తమ కలంతో అద్భుతాలను సృష్టిస్తుంటారు. అలాంటి వ్యక్తుల కోవకు చెందినవారిని ఉద్దేశించే మాటే 'చదివింది తక్కువైనా.. అక్షరాల కూర్పులో నేర్పరి!' దండేపల్లి గ్రామానికి చెందిన జంబోజు లింగమూర్తి జన్మస్థలం వెల్గనూర్ సాధారణ కుటుంబంలో జన్మించారు.

చదువు తక్కువ.. ఆలోచనలకు మాత్రం హద్దుల్లేవు!

పాఠశాల విద్య అనేది మనిషికి జ్ఞానాన్ని అందించే ఒక మార్గం మాత్రమే. అయితే జీవితమనే పాఠశాల నేర్పించే అనుభవాలు అంతకంటే విలువైనవి.పుస్తకాలు చదవడం ద్వారా ఒక వ్యక్తికి భాషపై పట్టు రావచ్చు. కానీ సమాజాన్ని పరిశీలించడం, మనుషుల మధ్య జీవించడం, కష్టసుఖాలను అనుభవించడం ద్వారా జీవితంపై లోతైన అవగాహన ఏర్పడుతుంది.

కొంతమందికి అక్షర పరిచయం మాత్రమే ఉండవచ్చు. కానీ ఆ అక్షరాలతో అద్భుతమైన వాక్యాలను నిర్మించే సామర్థ్యం ఉంటుంది. ఎక్కడ ఏ పదాన్ని ఉపయోగించాలి? ఏ సందర్భంలో ఏ వాక్యం పాఠకుడిని ఆకట్టుకుంటుంది? ఒక చిన్న వాక్యంలోనే పెద్ద భావాన్ని ఎలా వ్యక్తీకరించాలి? అనే విషయాల్లో వారికి సహజమైన ప్రతిభ ఉంటుంది.

ఇలాంటి ప్రతిభ ఒక్కరోజులో రాదు. నిరంతర పరిశీలన, ఆసక్తి, అభ్యాసం, అనుభవం కలిసినప్పుడు అది ఒక ప్రత్యేక నైపుణ్యంగా మారుతుంది.అలాంటి కోవకు చెందుతారని చెప్పవచ్చు.

అక్షరాలే ఆయుధాలు.. కలమే ప్రపంచం!

అక్షరాలను కూర్చడం అంటే కేవలం పదాలను వరుసగా రాయడం కాదు. ఒక భావానికి ప్రాణం పోయడం, ఒక సంఘటనకు రూపం ఇవ్వడం, ఒక సమస్యను సమాజం ముందుకు తీసుకురావడం.అలాంటి గేయాలను,పాటలను రాయడంలో జంబోజు లింగమూర్తి దిట్ట అనడంలో సందేహం లేదు. దానిక కారణం ఒక సంఘటనను అప్పటి కప్పుడు ఆ విషయాన్ని గుర్తించి, ప్రజలకు అర్థమయ్యేలా ఆకర్షణీయమైన శీర్షిక రూపొందించడం అందరికీ సాధ్యం కాదు.కాని అలా రాయడంలో నేర్పరి.ఒక సంఘటనను పది మంది పది రకాలుగా వివరిస్తారు. కానీ అందులోని ప్రధానాంశాన్ని గుర్తించి, తక్కువ పదాల్లో ఎక్కువ అర్థం వచ్చేలా రాయగలిగేవారే నిజమైన అక్షర శిల్పులు.వారికి పెద్ద పెద్ద పదాలు అవసరం ఉండవు. అలంకారాలతో కూడిన భాష అవసరం ఉండదు. సందర్భానికి తగిన పదం, భావానికి సరిపోయే వాక్యం, పాఠకుడిని ఆలోచింపజేసే శీర్షిక ఉంటే చాలు. అదే ఆయన ప్రత్యేకత.

ప్రతిభకు చదువు అడ్డంకి కాదు.. కానీ నిరంతర అభ్యాసం అవసరం

చదువు తక్కువగా ఉండటం ఒక వ్యక్తి ప్రతిభకు అడ్డంకి కాకపోవచ్చు. అయితే చదువును తక్కువగా చూడటం మాత్రం సరైన ఆలోచన కాదు. విద్య మనిషికి భాషా పరిజ్ఞానాన్ని, విషయ అవగాహనను, విశ్లేషణాత్మక ఆలోచనను అందిస్తుంది. సహజ ప్రతిభకు విద్య తోడైతే ఆ సామర్థ్యం మరింత ఉన్నత స్థాయికి చేరుతుంది.అందుకే ఎంతటి ప్రతిభ ఉన్నా కొత్త విషయాలను నేర్చుకోవడం, మంచి రచనలను చదవడం, భాషను మెరుగుపరుచుకోవడం, తప్పులను సరిదిద్దుకోవడం కొనసాగించాలి.ఎందుకంటే అక్షరాలపై పట్టు సాధించిన వ్యక్తి ఒక మంచి రచయితగా ఎదగవచ్చు.అదే వ్యక్తి తన ప్రతిభకు నిరంతర అభ్యాసాన్ని జోడిస్తే సమాజాన్ని ప్రభావితం చేసే రచయితగా నిలవవచ్చు.

గుర్తింపు కోసం కాదు.. తన ప్రతిభను నిరూపించుకోవడానికి!

ప్రతిభావంతులైన కొంతమంది వ్యక్తులకు పెద్దగా ప్రచారం ఉండకపోవచ్చు. ఉన్నత విద్యార్హతలు ఉండకపోవచ్చు. వారి పేరుకు ముందు పెద్ద పెద్ద బిరుదులు ఉండకపోవచ్చు. కానీ వారు రాసిన ఒక్క శీర్షిక, రూపొందించిన ఒక్క వ్యాసం, వ్యక్తీకరించిన ఒక్క భావం ఎంతోమందిని ఆలోచింపజేయగలదు.అలాంటి వ్యక్తులను వారి చదువుతో అంచనా వేయడం కంటే వారి పనితీరుతో అంచనా వేయడం సమంజసం.ఒక వ్యక్తి ఎంత చదివాడన్నది అతని విద్యార్హతను తెలియజేస్తుంది. కానీ అతను ఎంత గొప్పగా ఆలోచించగలడు, ఆ ఆలోచనలను ఎంత అందంగా అక్షరాల్లో వ్యక్తీకరించగలడు అన్నది అతని ప్రతిభను తెలియజేస్తుంది.

ముగింపు:

చదువు మనిషికి మార్గాన్ని చూపుతుంది. అనుభవం జీవితాన్ని నేర్పుతుంది. ప్రతిభ ఆలోచనలకు రూపాన్ని ఇస్తుంది. సాధన ఆ ప్రతిభకు పదును పెడుతుంది. ఈ నాలుగు కలిసినప్పుడే ఒక వ్యక్తి తనదైన ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటాడు.అందుకే ఒక మనిషిని అతను చదివిన తరగతులతోనో, సంపాదించిన సర్టిఫికెట్లతోనో మాత్రమే అంచనా వేయకూడదు. అతని ఆలోచనలను, రచనా సామర్థ్యాన్ని, సృజనాత్మకతను, పనితీరును కూడా గుర్తించాలి.ఎందుకంటే కొందరు పుస్తకాలను చదివి జ్ఞానాన్ని సంపాదిస్తారు.. మరికొందరు తమ అనుభవాలనే పుస్తకాలుగా మలుస్తారు. చదివింది తక్కువైనా అక్షరాలను అద్భుతంగా కూర్చగలిగే ప్రతిభ ఉన్నవారే రెండో కోవకు చెందినవారు!

పాగమంచు నేపథ్యంలో ప్రత్యేక వాహన తనిఖీలు

- 220కి పైగా వాహనాల తనిఖీ.. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు రూ.1.20 లక్షల జరిమానాలు

మంచిర్యాల,సత్యదీపిక ఉదయం :

చలికాలం నేపథ్యంలో ఉదయం వేళల్లో పొగమంచు అధికంగా ఉండటంతో రహదారి ప్రమాదాల నివారణకు, వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.మంచిర్యాల, శ్రీరాంపూర్,సీసీ నస్పూర్,కేతనపల్లి, మంచిర్యాల బైపాస్ రోడ్డు,గద్దెరగడి తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహిస్తూ వాహనాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రాంగ్ పార్కింగ్ చేసిన లారీలు,ఇతర భారీ వాహనాలతో పాటు మొత్తం 220కి పైగా వాహనాలను తనిఖీ చేశారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని మొత్తం రూ.1,20,000 జరిమానాలు విధించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ చలికాలంలో పొగమంచు కారణంగా రహదారిపై దృశ్యమానత తగ్గి, ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించక



ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. వాహనదారులు తమ వాహనాలకు రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవడంతో పాటు హెడ్‌లైట్లు, టెయిల్ లైట్లు, ఇండికేటర్లు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని సూచించారు.పొగమంచు ఎక్కువగా ఉన్న సమయంలో వాహనాలను నెమ్మదిగా నడపాలని,ముందు వెళ్తున్న వాహనానికి తగినంత దూరం పాటించాలని, అతివేగానికి దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా భారీ వాహనాల డ్రైవర్లు రహదారి పక్కన నిర్లక్ష్యంగా లేదా రాంగ్ పార్కింగ్ చేయకూడదని స్పష్టం చేశారు. వాహనం మరమ్మతులకు గురైనప్పుడు రహదారిపై ఇతర వాహనాలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని ఏసీపీ సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.ఈ తనిఖీల్లో రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ రావు,మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనన్,ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ సర్వే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

మంచిర్యాల ,సత్యదీపిక ఉదయం :

పెండింగ్ సర్వే దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే, సబ్ కలెక్టర్ కార్యాలయం ఎ.ఓ., అన్ని మండలాల తహసిల్దార్లు, అధికారులు, సంబంధిత సెక్షన్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సర్వే దరఖాస్తులు, సర్వే పనుల పురోగతి, జి.ఓ. నం. 76, 59 అమలు తీరు, ఎస్‌ఐఆర్ ప్రక్రియ, భూ భారతి, భూదాన్ భూములకు సంబంధించిన ఫైళ్లు, కోర్టు కేసులపై సమీక్షించారు. ఆయా అంశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న



పనులన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా ప్రతి పనిని పూర్తి చేయాలని, ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశించిన సమయంలోగా అన్ని పనులు పూర్తి చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక గుస్సాడి దండారి వేడుకలు

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అదిలాబాదు ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు గుస్సాడి దండారి ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గిరిజనుల ప్రత్యేక సంస్కృతిని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.గురువారం సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో నిర్వహించిన గుస్సాడి దండారి ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో మంద మకరంద్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామస్థులతో కలిసి





ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవాల్లో సందడి చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజనుల విశిష్టమైన సంప్రదాయంలో భాగమైన గుస్సాడి దండారి వేడుకల్లో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఏడాది ఈ వేడుకల్లో భాగస్వామ్యం కావడం సంతోషాన్నిస్తోందని పేర్కొన్నారు. తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ వాటిని భావితరాలకు అందిస్తున్న గిరిజనులను అభినందించారు.ఐటీడీఏ పీవో మంద మకరంద్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల అభివృద్ధితో పాటు వారి సాంస్కృతిక వేడుకలకు ఐటీడీఏ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. గుస్సాడి దండారి నృత్య సంప్రదాయం ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని, ఈ వారసత్వాన్ని భావితరాలకు అందించడం అందరి బాధ్యతని తెలిపారు. గిరిజన సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, గుస్సాడి దండారి వేడుకలు ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఒక గ్రామానికి చెందిన దండారి బృందాలు మరో గ్రామానికి వెళ్లి వేడుకల్లో పాల్గొనడం గిరిజనుల మధ్య ఉన్న ఐక్యతకు నిదర్శనమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ శాంతిభద్రతలను పాటిస్తూ పండుగలను సంప్రదాయబద్ధంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని సూచించారు. రిమ్మ గ్రామం ఇప్పటికే అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుస్తోందని, గ్రామస్థులంతా ఐక్యంగా గుస్సాడి దండారి ఉత్సవాల్లో పాల్గొనడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రుత్విక్, ఎంపీడీవో సంతోష్, గ్రామ పటేల్ శంకర్, విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు మహేందర్, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



సింగరేణిలో రిజర్వేషన్లు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి కృషి చేయాలి

- సింగరేణి డైరెక్టర్లకు ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు చిలుక రాజనర్సు

హైదరాబాద్, నవంబర్ 05, సత్య దీపిక ఉదయం:

హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు, ఐఏఎస్, డైరెక్టర్ (పీపీ) కె. వెంకటేశ్వర్లును జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిలుక రాజనర్సు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. సంస్థలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి, అర్హులైన అభ్యర్థులతో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఎస్సీ వర్గీకరణ అమలుకు సంబంధించి ప్రభుత్వం చట్టపరమైన జీఓ జారీ చేసిన నేపథ్యంలో సింగరేణి సంస్థలో కూడా మాదిగ, మాదిగ ఉపకులాలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఈ అంశాలపై డైరెక్టర్లు సానుకూలంగా స్పందించడంతో చిలుక రాజనర్సు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయం జరిగేలా సింగరేణిలో రిజర్వేషన్ల అమలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శాంతిఖని ఫిట్ కార్యదర్శి రత్నం ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



ఆరు నిత్యావసర సరుకుల హామీని వెంటనే అమలు చేయాలి

- ప్రజల కష్టాలు తీర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం.

- రేషన్ కార్డుదారులకు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వం.- ఎంసీపీఐయు నాయకులు సబ్బని రాజేంద్రప్రసాద్, పసులేటి వెంకటేష్ డిమాండ్.

బెల్లంపల్లి, నవంబర్ 05, సత్య దీపిక ఉదయం:

ప్రజల కష్టాలు తీర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎంసీపీఐయు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్



విమర్శించారు. గురువారం బెల్లంపల్లిలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, ఎల్‌నినో ప్రభావంతో ప్రజలపై మరింత ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు రేషన్ బియ్యంతో పాటు మరో ఆరు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు ఆ హామీ అమలుకు నోచుకోకపోవడం బాధాకరమన్నారు. కందిపప్పు, పామ్ ఆయిల్, చక్కెర, చింతపండు, కారం పొడి, పసుపు వంటి ఆరు నిత్యావసర సరుకులను రేషన్ కార్డుదారులకు అందిస్తామని ప్రకటించి, ఆచరణలో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ప్రకటనలు పత్రికలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు కావాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో పేద ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, రేషన్ కార్డుదారులకు బియ్యంతో పాటు ఆరు నిత్యావసర సరుకులను వెంటనే పంపిణీ చేయాలని వారు కోరారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఎంసీపీఐయు పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, బెల్లంపల్లి మండల కార్యదర్శి తోగరి రాహుల్, రాజేష్, ఆకాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి

- నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలి

- నవంబర్ 10న చలో కలెక్టరేట్

బెల్లంపల్లి, నవంబర్ 05, సత్య దీపిక ఉదయం:

మంచిర్యాల జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని, నిత్యావసర సరుకుల ధరలను తక్షణమే నియంత్రించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 10న నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను గురువారం బెల్లంపల్లిలోని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు



లక్ష్మణ్, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, పట్టణ కార్యదర్శి ఆడపు రాజమౌళి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడి పంటలు దెబ్బతిన్నాయని, కరువు పరిస్థితుల కారణంగా సాగు చేసిన రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మంచిర్యాల జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులను ఆసరాగా చేసుకొని వ్యాపారులు నిత్యావసర సరుకులను బ్లాక్ మార్కెట్‌కు తరలించి, కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచి ప్రజలను దోపిడీ చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టి నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని కోరారు. కరువు వల్ల నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని, తెల్ల రేషన్ కార్డుదారులందరికీ నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పశువులకు అవసరమైన మేత, తాగునీరు అందించి పశుపోషకులను ఆదుకోవాలని, సాగునీరు, తాగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం నవంబర్ 10న మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, జిల్లా సమితి సభ్యులు రత్నం రాజం, మేకల రాజేశం, నాయకులు కే. తిరుపతి, జి. మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి ..జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల,నవంబర్ 5, సత్యదీపిక ఉదయం :

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో నూతనంగా నిర్మించిన వంటగది, భోజనశాల పరిశీలించి, విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారంతో పాటు నాణ్యమైన విద్యా బోధన అందించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎం.పి.సి. విద్యార్థినులకు గణితంలో అందిస్తున్న బోధన, వారి అభ్యసన స్థాయిని పరిశీలించి పలు సూచనలు చేశారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, అధికారుల

తో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాలలో ప్రభుత్వ భూముల పరిరక్షణ అంశాలను పరిశీలించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా నిరంతరం పర్యవేక్షించాలని, ఆక్రమణలు గుర్తించినట్లయితే వెంటనే స్పందించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలోని కృష్ణా మందిర్ రోడ్డు నం.2 లో ధనలక్ష్మి ట్రేడర్ వారు ఏర్పాటు చేసిన బియ్యం



అమ్మకాల అవుట్ లెట్ ను జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, మండల తహసిల్దార్ కృష్ణ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్ లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని, తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన బి.పి.టి. న్యూ రైస్ బ్యాగ్ ను 1 వేయి 430 రూపాయలు, స్టీమ్ రైస్ ను 1 వేయి 560 రూపాయలు, హెచ్.ఎం.టి. స్టీమ్ రకం బియ్యం బస్తా 1 వేయి 898 రూపాయల చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. జిల్లాలోని మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ప్రాంతాలలో ప్రత్యేక విక్రయ



కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, భీమారం, శక్తి పేట ప్రాంతాలలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మార్కెట్ ధరలతో పాటు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కటే తక్కువ ధరకు నాణ్యమైన బియ్యాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు విద్యుత్, త్రాగునీరు, సాగునీటి వినియోగంలో పొదుపు పాటించాలని తెలిపారు. రైతులు తక్కువ నీటి అవసరం ఉన్న జొన్న, మొక్కజొన్న, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలలో నీటి వృధాను అరికట్టాలని, విద్యుత్ ను పొదుపుగా వినియోగించాలని, అవసరంలేని సమయంలో ఫ్యాన్లు, లైట్లు ఆపివేయాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 11 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించడం జరిగిందని, నేలను తేమ శాతం, పంటలపై ప్రభావం, లోటు వర్షపాతం అంశాలను ప్రామాణికంగా తీసుకొని శాస్త్రీయంగా అంచనా వేయడం జరిగిందని తెలిపారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.తాండూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ తో కలిసి సందర్శించి ప్రభుత్వ భూముల పరిరక్షణపై అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమించినట్లయితే క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆక్రమణదారులకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయాలని, ప్రభుత్వ భూములను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూభారతి దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తాండూర్ నాయబ్ తహసీల్దార్ కల్పన, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. పోర్టల్, డిజిటల్ గవర్నెన్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు



మంచిర్యాల,సత్యదీపిక ఉదయం :

ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. పోర్టల్, డిజిటల్ గవర్నెన్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో హెచ్ ఓ ఓ లు, డి డి ఓ లు, మండల స్థాయి అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యతనిస్తూ ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తుందని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నుంచి ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. పోర్టల్ ద్వారా అన్ని బిల్లుల సమర్పణ డిజిటల్ విధానంలో కొనసాగుతుందని, 2027 జనవరి 1వ తేదీ నుంచి మాన్యువల్ విధానానికి పూర్తిగా స్వస్తి పలికి, ప్రభుత్వ కార్యకలాపాలను డిజిటల్ విధానంలోనే నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 31వ తేదీలోగా ఉద్యోగుల సర్వీస్ రిజిస్టర్లలో చేయవలసిన అన్ని వివరాల నమోదు, అప్‌డేషన్లను పూర్తి చేయాలని సూచించారు. జనవరి 1వ తేదీ నుంచి ఎంప్లాయీ సర్వీస్ రిజిస్టర్ పూర్తిస్థాయిలో అమలులోకి వస్తుందని తెలిపారు. నూతన డిజిటల్ విధానాలపై ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పూర్తి అవగాహన కలిగి ఉండాలని, శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. శిక్షణలో భాగంగా ఈ.ఎస్.ఆర్. లో ఉద్యోగుల వివరాల నమోదు, నియామకాలు, పోస్టింగులు, సెలవుల దరఖాస్తు, సెలవుల రద్దు తదితర అంశాలను ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ ఆర్ ఎస్ లో ఒకసారి నమోదు చేసిన వివరాలను తిరిగి ఎడిట్ / డిలీట్ చేసే అవకాశం లేనందున, వివరాల నమోదు, ఆమోదం సమయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సందేహాలను శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు సాలార్-ఎ-మిల్లత్ ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ

బెల్లంపల్లి, నవంబర్ 05, సత్య దీపిక ఉదయం

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏఐఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో సాలార్-ఎ-మిల్లత్ ఆల్ ఇన్ వన్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఏఐఎంఐఎం



అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ, పార్టీ అధ్యక్షుడు ఇమ్రోజ్‌తో పాటు పార్టీ క్రియాశీల కార్యకర్తలు పాఠశాలకు వెళ్లి పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందజేశారు. విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకోవాలనే లక్ష్యంతో ఈ పుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థుల చదువుకు అవసరమైన సహకారం అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రైతు భరోసానిధులను వెంటనే విడుదల చేయాలి

- వరి కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో- రామారావు పటేల్

లోకేశ్వరం సత్యదీపిక ఉదయం న్యూస్

తుఫాను ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని, రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ డిమాండ్ చేశారు. లోకేశ్వరం మండలం కనకాపూర్,అబ్దుల్లాపూర్, ధర్మోరా,పంచగుడి,గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....మార్కెట్లో మద్దతు ధర కల్పించేందుకే ఐకెపి ఆధ్వర్యంలో ప్రభుత్వం కొనుగోళ్లను ప్రారంభించిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఏ.గ్రేడు రకానికి ?2461 బి.గ్రేడ్ రకానికి ?2441 ధరతోపాటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో 7 రకాల సన్న వరి ధాన్యానికి ?500 రూపాయలు బోనస్ లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఎ పి.డి.విజయలక్ష్మి,సర్పంచులు మామిడి సంజీవరెడ్డి,సునీల్, నాయకులు బద్దం గంగారెడ్డి,జై సాగర్ రావు,సంటెన్న,శ్రీధర్,నర్సాగౌడ్,కిష్టయ్య,భాస్కర్ రెడ్డి, భోజన్న, రమేష్,మంద భాస్కర్,వెంకట్ రెడ్డి,రాజశేఖర్, గంజాల గంగాధర్,కారగీరు గంగాధర్,సాయందర్, ఏఈఓ,లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఐకెపి సిబ్బంది, తదితరులు ఉన్నారు.



జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలకు

విశేష స్పందన

అండర్ 14 బాలుర విభాగంలో 200 మంది క్రీడాకారుల ప్రతిభాప్రదర్శన

మంచిర్యాల, నవంబర్ 5, సత్యదీపిక ఉదయం :

ఎస్‌జీఎఫ్ మంచిర్యాల ఆధ్వర్యంలో, జెడ్పీహెచ్ఎస్ జైపూర్ సౌజన్యంతో మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్--14 బాలుర జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు



200 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ జలీల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండి రమేష్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.డి. యాకూబ్, నిర్వహణ కార్యదర్శి సిరంగి గోపాల్, టోర్నమెంట్ పరిశీలకుడు కె. రామ్మోహన్ రావు, పీఈటీఏ రాష్ట్ర అధ్యక్షులు ఆర్. రాజయ్య, సుదర్శన్, క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ప్రదీప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే పీఈఆర్, పీడీలు మల్లేష్, సత్యనారాయణ, విట్టల్‌తో పాటు జిల్లా నలుమూలల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తైక్వాండోలో మంచిర్యాల క్రీడాకారుల

పతకాల పంట!

- జేఎన్‌టీయూ రాష్ట్రస్థాయి యూనివర్సిటీ క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులు.. ఒక స్వర్ణం, రెండు రజత పతకాలతో జిల్లాకు కీర్తిప్రతిష్ఠలు

మంచిర్యాల,నవంబర్ 5, సత్యదీపిక ఉదయం :

జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యూనివర్సిటీ క్రీడా పోటీల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన తైక్వాండో క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలతో మెరిశారు. తమ క్రీడా నైపుణ్యంతో ప్రత్యర్థులను అధిగమించి ఒక బంగారు పతకంతో పాటు రెండు వెండి పతకాలను సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.ఈ పోటీల్లో వి. అస్మిత 62 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి ప్రథమ స్థానంలో నిలవగా,జి. సాత్విక్ వర్మ 80 కిలోల విభాగంలో, అఖిల్ 62 కిలోల విభాగంలో వెండి పతకాలు కైవసం చేసుకున్నారు.రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాభిమానులు ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి శిక్షకులు మండ శ్రీనివాస్, నాకిరెడ్డి శ్రవణ్ ప్రసాద్ అందించిన శిక్షణ, ప్రోత్సాహం కీలకమని తెలిపారు.



జిల్లాలో పకడ్బందీగా 'అగ్రిస్టాక్' అమలు,

రైతుల సేవల్లో పారదర్శకతే లక్ష్యం

- జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశంలో కలెక్టర్ రాజర్షి షా

అదిలాబాదు ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :



వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను జోడించి, రైతులకు ప్రభుత్వ పథకాలు, సేవలను మరింత పారదర్శకంగా అందించేందుకు ఉద్దేశించిన 'అగ్రిస్టాక్' ప్రాజెక్టును జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో అగ్రిస్టాక్ అమలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సవాళ్ల పరిష్కారంపై ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగానికి సంబంధించి మౌలిక డేటా నాణ్యతను మెరుగుపరచడం, భూ రికార్డులను సమగ్రంగా అనుసంధానం చేయడంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఫార్మర్ రిజిస్ట్రీ అప్‌డేషన్, జియో-రిఫరెన్స్ భూ రికార్డులతో డిజిటల్ క్రాప్ సర్వేను పక్కాగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని పలు గ్రామాల్లో వంద శాతం డిజిటల్ క్రాప్ సర్వే పూర్తయిందని, సాంకేతిక సమస్యలు ఉన్నచోట తప్పుల సవరణ, మ్యాపింగ్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆధార్ లింకింగ్, ఈ-కేవైసీ, ఓటీపీ సమస్యల వల్ల రైతుల నమోదులో వస్తున్న ఆటంకాలను వేగంగా పరిష్కరించి, ధ్రువీకరించిన ఫార్మర్ ఐడీ ద్వారా పారదర్శకంగా సేవలు అందేలా చూడాలన్నారు. సొంత భూమి లేని కౌలు రైతులకు, నాన్-డీఎస్ రైతులకు ఎదురవుతున్న గుర్తింపు సమస్యలను అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అగ్రిస్టాక్ డేటా ఆధారంగా పంటల బీమా, మార్కెట్ సదుపాయాలు, లాజిస్టిక్స్ రైతులకు వ్యవసాయ రుణాలు సులభంగా అందేలా కన్సెంట్-బేస్డ్ డిజిటల్ విధానాలను రూపొందించాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి సవాళ్లను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలను నవంబర్ 5 వ తేదీలోగా ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. సంబంధిత ప్రతిపాదనలు, టాస్క్‌ఫోర్స్ డాక్యుమెంట్లను అగ్రిస్టాక్ పోర్టల్‌లో నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం విధిగా అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ వంశీకృష్ణ, డీఆర్డీవో రవీందర్ రాథోడ్, డీఎంవో అధికారి గజానన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ ప్రభాకర్, డీహెచ్ఎస్వో సందీప్, మార్క్‌ఫెడ్ డీఎం మహేష్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ అశోక్, సీపీవో వెంకట రమణ, ఇంచార్జి వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, టెక్నికల్ ఏవో విశ్వామిత్ర, విశ్వనాథ్, ఈడియం రవి, సైంటిస్ట్ శ్రీధర్ చౌహాన్, రామ్ గోపాల్ వర్మ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన యువకుడిని ఆర్డీఓ. ఎదుట హాజరుపరిచిన శ్రీరాంపూర్ పోలీసులు

మంచిర్యాల,సత్యదీపిక ఉదయం :

శ్రీరాంపూర్ ఏరియా అరుణక్క నగర్‌కు చెందిన జలంపల్లి సందీప్, వయస్సు 19 సంవత్సరాలు, గతంలో నేరాలకు పాల్పడిన నేపథ్యంలో, సత్ప్రవర్తనతో ఉండేలా గౌరవ ఆర్డీఓ.మంచిర్యాల వారి ఎదుట బైండోవర్ చేయడం జరిగింది.అయితే, బైండోవర్ నిబంధనలను పాటించకుండా సత్ప్రవర్తనకు విరుద్ధంగా వ్యవహరిస్తూ,తిరిగి నేరాలు మరియు గొడవలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది.దీంతో బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆకుల అశోక్ ఆధ్వర్యంలో అతనిని గురువారం ఆర్డీఓ. మంచిర్యాల వారి ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఆర్డీఓ. అతనికి నోటీసులు జారీ చేశారు.ఆర్డీఓ. మంచిర్యాల వారు జారీ చేసిన నోటీసుల ప్రకారం, బైండోవర్‌లో విధించిన షరతులను ఉల్లంఘించినందుకు గడువులోగా రూ.1,00,000/- జరిమానా చెల్లించాల్సి ఉంటుందని, జరిమానా చెల్లించని పక్షంలో ఆరు నెలల జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుందని శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆకుల అశోక్ తెలిపారు.బైండోవర్‌లో ఉన్న వ్యక్తులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

భూముల రీ సర్వే ను
పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల,నవంబర్ 5, సత్యదీపిక ఉదయం :

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్ లతో కలిసి సర్వేయర్లకు జి.ఎన్.ఎస్.ఎస్. రోవర్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, సంబంధిత రైతులకు ముందుగా సమాచారం అందించి, ప్రతి రైతు రీ సర్వేలో హాజరయ్యే విధంగా టామ్ టామ్ ద్వారా తెలియజేయాలని తెలిపారు. రీ సర్వే ద్వారా భవిష్యత్తులో భూ సమస్యలు ఉండవని తెలిపారు. ప్రక్రియ నిర్వహణ కొరకు సర్వేలో వినియోగించే 12 రోవర్లను అందించడం జరిగిందని, వీటి ద్వారా ఖచ్చితమైన సర్వేను చేపట్టడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

భద్రత, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి..జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ ప్రతినిధి, సత్యదీపిక ఉదయం :

రానున్న గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పుష్కరాల నిర్వహణకు ముందస్తు ప్రణాళికతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాసరతో పాటు జిల్లాలోని పుష్కర ప్రాంతాల్లో భక్తులు సౌకర్యవంతంగా పుణ్యస్నానాలు ఆచరించేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ప్రతి



అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృతంగా పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని, స్పష్టమైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పుష్కర ఘాట్ల వద్ద నిరంతరం పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టడంతో పాటు, భక్తులకు మార్గనిర్దేశం చేసేందుకు అవసరమైన చోట్ల సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులతో పాటు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి కూడా అవసరమైన వసతులు కల్పించాలని తెలిపారు.భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. పుష్కర ప్రాంతాల్లో అవసరమైన అన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావు, ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ ఈఈలు సందీప్, సుభాష్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు స్వయం ఉపాధి శిక్షణ అందించేలా చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

గ్రామీణ నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి, స్వయం ఉపాధి



అవకాశాలు కల్పించే లక్ష్యంతో దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం (ఆర్ఎస్ఈటీఐ) ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామ సమీపంలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, భవన సదుపాయాలు, ఖాళీ స్థలాలు, శిక్షణ తరగతుల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులను పరిశీలించారు. కేంద్రం ఏర్పాటుకు కల్పించాల్సిన సదుపాయాలపై అధికారులతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ యువతలో నైపుణ్యాలను పెంపొందించి, వారికి స్వయం ఉపాధి మార్గాలను చూపడమే ఆర్ఎస్ఈటీఐ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. యువత శిక్షణను సద్వినియోగం చేసుకుని సొంతంగా ఉపాధి పొందేలా నాణ్యమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణకు వచ్చే వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, మహిళా శిశు వికాస కేంద్ర మేనేజర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చేయూత పింఛను దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా పూర్తి చేయాలి

- ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు కలగకుండా చూడాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

చేయూత పింఛను దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలాల వారీగా చేయూత పింఛను దరఖాస్తుల పరిశీలన వివరాలను సమీక్షించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడాలని ఆదేశించారు.రానున్న రోజుల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు.ప్రణాళికాబద్ధంగా నీటి సరఫరా జరగాలని, ఎక్కడా నీటి సమస్య రాకూడదని స్పష్టం చేశారు. జిల్లాలోని బోరుబావుల సమాచారాన్ని సేకరించాలని సూచించారు.జిల్లాలో అర్హులందరికీ



ఇందిరమ్మ ఇళ్లు అందేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటివరకు మంజూరైన ఇళ్లు, పూర్తయినవి,నిర్మాణంలో ఉన్న ఇళ్ల వివరాలను ఈ సందర్భంగా సమీక్షించారు.అనంతరం విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పీఎం శ్రీ పాఠశాలల నిర్వహణపై సమీక్షించారు. పీఎం శ్రీ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, వారి సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులను క్షేత్రస్థాయి పర్యటనలకు తీసుకెళ్లాలని, జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యూఎస్, నీటిపారుదల శాఖల ఈఈలు సుభాష్, సందీప్, అనిల్, డిఈఓ భోజన్న, హౌసింగ్ పిడి శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించాలి

- అర్హులైన లబ్ధిదారులకు రుణాలు, సబ్సిడీ పథకాలు చేరాలి- కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రుణ, సబ్సిడీ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బ్యాంకింగ్ అధికారులను




ఆదేశించారు.గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజల ఆర్థిక అభివృద్ధికి బ్యాంకులు మరింత చొరవ చూపాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందించే రుణాలను అర్హులకు సకాలంలో మంజూరు చేయాలని, తద్వారా ప్రజల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడాలని అన్నారు.ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంలో ప్రతికూల పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో రైతులకు వ్యవసాయ రుణాలు, ఇతర సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం రూపొందిస్తున్న విధానాలు, పథకాలపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా రైతులకు మారటోరియం అంశంపై స్పష్టమైన అవగాహన కల్పించి, వారికి అవసరమైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకట మాధవరావు, రాథోడ్ రమేష్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఆర్బీఐ ఏజీఎం రాములు, నాబార్డు డీడీఎం అబ్దుల్ రవూఫ్, వివిధ బ్యాంకుల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సువార్త పత్రికలు పంచుతున్న
మహిళలపై దాడి

- ఘటనను ఖండించిన క్రైస్తవ సంఘాలు

ఆసిఫాబాదు,సత్యదీపిక ఉదయం :

హైదరాబాద్ నగర నడిబొడ్డున ఇద్దరు యువతులు సువార్త



పత్రికలు పంచుతున్న సమయంలో ఓ వ్యక్తి వారిని దుర్భాషలాడుతూ, దాడికి పాల్పడినట్లు ఆరోపణలు రావడం తీవ్ర కలకలం రేపింది. బహిరంగ ప్రదేశంలో మహిళల పట్ల అవమానకరంగా ప్రవర్తిస్తూ, వారిపై చేయి చేసుకున్నట్లు చెబుతున్న ఈ ఘటనపై క్రైస్తవ సమాజం తీవ్ర మనస్తాపం వ్యక్తం చేసింది.తమ విశ్వాసానికి సంబంధించిన సువార్త పత్రికలను పంచుతున్న మహిళలపై ఈ విధంగా దూషణలు, దాడి జరగడం బాధాకరమని పలువురు క్రైస్తవులు పేర్కొన్నారు. ఎవరి మత విశ్వాసాలు, అభిప్రాయాలు ఏవైనా, వాటిని వ్యక్తపరిచే హక్కును గౌరవించాలని వారు కోరారు.మహిళలను బహిరంగ ప్రదేశంలో దుర్భాషలాడటం, భయభ్రాంతులకు గురిచేయడం లేదా భౌతికంగా దాడి చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించలేమని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు అన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు."విశ్వాస భేదాలు ఉన్నప్పటికీ పరస్పర గౌరవం, శాంతి, చట్టబద్ధతను కాపాడుకోవాలి. మహిళలపై దాడి చేయడం ఏ కారణంతోనూ సమర్థనీయం కాదు" అని వారు పేర్కొన్నారు.ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, దాడికి దారితీసిన పరిస్థితులు మరియు బాధ్యులపై తీసుకున్న చర్యలపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. అప్పటివరకు సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న నిర్ధారణ కాని వివరాలను నమ్మకుండా, అధికారిక సమాచారం కోసం వేచి చూడాలని కోరుతున్నారు.

ఎన్ఎంసీ నుంచి అదనంగా
21 పీజీ వైద్య సీట్లు మంజూరు

- ఆదిలాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో మొత్తం 90కి చేరిన పీజీ సీట్లు: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ ,సత్యదీపిక ఉదయం :

ఆదిలాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) తాజాగా అదనంగా 21 పీజీ వైద్య సీట్లు మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.వివిధ వైద్య విభాగాల్లో కొత్తగా సీట్లు మంజూరు కావడంతో కళాశాలలో పీజీ వైద్య సీట్ల సంఖ్య మొత్తం 90కి చేరిందని వెల్లడించారు. ఈ అదనపు సీట్ల మంజూరు జిల్లాలో వైద్య విద్య అభివృద్ధికి, నిపుణులైన వైద్యుల తయారీకి మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు.

విభాగాల వారీగా మంజూరైన అదనపు పీజీ సీట్లు:

పీడియాట్రిక్స్ -- 4, సైకియాట్రీ -- 3, రేడియాలజీ -- 2, ప్రసూతి, స్త్రీ వైద్య విభాగం -- 4,ఆర్థోపెడిక్స్ -- 2,ఈఎన్‌టీ -- 6 ప్రభుత్వ వైద్య కళాశాల అభివృద్ధికి, పీజీ సీట్ల మంజూరుకు కృషి చేసిన వైద్య కళాశాల అధికారులు, వైద్యులు, సంబంధిత శాఖల ప్రతినిధులను జిల్లా కలెక్టర్ అభినందించారు. భవిష్యత్తులోనూ వైద్య విద్యా ప్రమాణాలను పెంపొందించడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

